మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

బుధవారం WEDNESDAY 8-7-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 2 Volume:2 || సంచిక: 9 Issue: 9


08 జూలై 2026 - బుధవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:51 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి అష్టమి మ. 12:17 వరకు తరువాత నవమి సంస్కృత వారం సౌమ్య వాసరః నక్షత్రం రేవతి సా. 4:00 వరకు తరువాత అశ్విని యోగం అతిగండ మ. 12:31 వరకు కరణం కౌలవ మ. 12:17 వరకు తైతుల రా. 11:30 వరకు వర్జ్యం లేదు దుర్ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:47 వరకు రాహుకాలం మ. 12:21 నుండి మ. 1:58 వరకు యమగండం ఉ. 7:28 నుండి ఉ. 9:06 వరకు గుళికాకాలం ఉ. 10:43 నుండి మ. 12:21 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:15 నుండి తె. 5:03 వరకు అమృత ఘడియలు మ. 1:37 నుండి మ. 3:11 వరకు అభిజిత్ ముహూర్తం లేదు గమనిక: "ం" అనగా మరుసటి రోజున


Circulated to Telangana
Published from Jagitial




## 38 మందికి మరణశిక్ష

**11 మందికి యావజ్జీవ శిక్ష కొనసాగింపు.. 2008లో జరిగిన పేలుళ్ల ఘటన**

**56 మంది మృతి, 246 మంది గాయాలు.. బాధితులకు రూ.10 లక్షల పరిహారం**

### గుజరాత్ హైకోర్టు సంచలన తీర్పు



అహ్మదాబాద్, జూలై 7: 2008లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌ను వణికించిన వరుస బాంబు పేలుళ్ల కేసులో గుజరాత్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రత్యేక కోర్టు గతంలో విధించిన 38 మంది దోషులకు మరణశిక్షను సమర్థించింది. మరో 11 మందికి జీవిత ఖైదు శిక్షను ఖరారు చేసింది. ఈ పేలుళ్లలో 56 మంది ప్రాణాలు -2 వ పేజీలో...



## తాజ్ మహలా..? తేజో మహలా?

## కేంద్రానికి హైకోర్టు నోటీసు

**2015లో రిట్ పిటిషన్‌తో మొదలైన తాజ్ మహల్ వివాదం**

**పిటిషనర్ల వాదనలను తోసిపుచ్చని దిగువ న్యాయస్థానాలు**

**ఆర్టికల్ 227 ప్రకారం అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు**

షాజహాన్ నిర్మించిన, ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధ వారసత్వ ప్రదేశాలలో ఒకటైన ఆగ్రాలోని ప్రఖ్యాత తాజ్ మహల్చు ట్టూ నెలకున్న వివాదంలో అలహాబాద్ హైకోర్టు ఎట్టకేలకు జోక్యం చేసుకుంది.

ప్రయాగ్‌రాజ్, జూలై 7: ప్రపంచ ప్రసిద్ధమైన ఈ కట్టడాన్ని హిందూ ఆలయంపై నిర్మించారని పేర్కొంటూ దాఖలైన పిటిషన్‌ను కోర్టు విచారణకు స్వీకరించి, ప్రభుత్వానికి, ఇతర ప్రతివాదులకు నోటీసు జారీ చేసింది. జస్టిస్ రోహిత్ రంజన్ అగర్వాల్ దీనిని న్యాయ సమీక్షకు అర్హమైనదిగా భావించి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 227 పరిధిలో ఈ విషయాన్ని పరిగణనలోకి -2 వ పేజీలో...




## కవిత వాదన వినాలి

**ఈసీకి ఢిల్లీ హైకోర్టు సూచన.. నోటీసులకు జవాబివ్వండి**

**ఈసీ విధుల్లో జోక్యం చేసుకోం.. స్పష్టం చేసిన న్యాయస్థానం**

కల్వకుంట్ల కవిత స్థాపించిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ పేరుపై ప్రజా అభ్యంతరాలు ఉన్నాయంటూ కేంద్ర ఎన్నికల సంఘం దాని రిజిస్ట్రేషన్‌ను తిరస్కరించిన విషయం అందరికీ తెలిసిందే. 15 రోజుల్లోనే మూడు ప్రత్యామ్నాయ పేర్లు ఇవ్వాలని, లేదంటే దరఖాస్తును రద్దు చేస్తామని కూడా స్పష్టం చేసింది.

న్యూఢిల్లీ/హైదరాబాద్, జూలై 7 (ఈవార్తలు): దీనిపై న్యాయ పోరాటానికి దిగారు కవిత. ఢిల్లీ హైకోర్టుకు వెళ్లగా.. ఈ వ్యవహారంలో తాము నేరుగా జోక్యం చేసుకోలేమని న్యాయస్థానం స్పష్టం చేసింది. ముందుగా ఎన్నికల సంఘం లేవనెత్తిన అభ్యంతరాలకు సరైన రీతిలో సమాధానం ఇవ్వాలని కవితకు ఉన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. కల్వకుంట్ల కవిత తన కొత్త పార్టీ రిజిస్ట్రేషన్ కోసం 'తెలంగాణ రక్షణ సమితి' అనే పేరును ప్రతిపాదిస్తూ తరువాయి 2 వ పేజీలో...

## కేసీఆర్ మెదడు కూలేశ్వరం



## నిజాలను మ్యానిపులేట్ చేశారు

**ఇంజినీర్లు హెచ్చరించినా వినలేదు.. మేడిగడ్డ.. ఇసుక మేడ**

**ఏడాదిన్నరకే కుప్పకూలింది.. రీ-డిజైన్ పేరులో కోట్లు దోచేశారు.. సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు**

కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. ప్రాజెక్టు రీడిజైన్, మేడిగడ్డ బరాజ్, నిర్మాణ లోపాలు, చీఫ్‌నూూ నివేదిక, జ్యుడీషియల్ విచారణపై కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టుపై విస్తృతంగా మాట్లాడారు.

హైదరాబాద్, జూలై 7 (ఈవార్తలు): నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమర్పించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ అనంతరం గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు రూపకల్పన, నిర్మాణం, నిర్వహణలో చోటుచేసుకున్న అంశాలపై సీఎం తీవ్ర విమర్శలు చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొన్నారు. ప్రారంభంలో గతంలో గోదావరి వరదల సమయంలో కాళేశ్వరం పంప్‌హౌస్‌లు నీట మునిగిన దృశ్యాలను ప్రదర్శించారు. సీఎం రేవంత్ మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టును ప్రజల ప్రయోజనాల కోసం కాకుండా భారీ వ్యయాలతో రీడిజైన్ చేసి ఖర్చులు పెంచారని ఆరోపించారు. ప్రాజెక్టు నిర్మాణంలో కమిషన్ల కోసమే మార్పులు చేశారని, దీంతో ప్రజాధనం భారీగా వృథా అయిందని విమర్శించారు. మేడిగడ్డ బరాజ్ ప్రధాన భాగమని, దాని పిల్లర్లు దెబ్బతిన్న తర్వాత కూడా ప్రాజెక్టుకు ఎలాంటి నష్టం లేదని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణకు గోదావరి జలాలను అందించాలనే లక్ష్యంతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ప్రారంభించారని సీఎం గుర్తు చేశారు. కాకా వెంకట స్వామి సూచన మేరకు ఈ ప్రాజెక్టుకు ఆ పేరు పెట్టినట్లు తెలిపారు. 2012 మే -2 వ పేజీలో...



## గిట్లుంటదా?

**నా శాఖ అధికారులతో కడియం సమీక్షా?**

**మంత్రిగా నా పరిధిని బేఖాతరు చేశారు**

**విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి**

**రేవంత్‌కు కొండా సురేఖ డిమాండ్**

హైదరాబాద్, జూలై 7 (ఈవార్తలు): మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మధ్య ఆధిపత్య పోరు కాంగ్రెస్ పార్టీలో దుమారం రేపుతోంది. కడియం శ్రీహరిపై ఏకంగా సీఎం రేవంత్ రెడ్డికి కొండా సురేఖ ఫిర్యాదు చేయడం చర్చనీయాంశంగా మారింది. దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి అయిన తనకే కనీస సమాచారం ఇవ్వకుండా... ఆ శాఖ ఉన్నతాధికారులతో కడియం ఏకంగా అధికారిక సమీక్ష నిర్వహించారంటూ మంత్రి కొండా




**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,526 |
| వెండి (కిలో): | రూ.2,50,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,961 |

### విశ్వవాణి



ఇంగ్లండ్‌లోని రోథర్‌హామ్ పట్టణంలో రహదారుల పక్కన ఉన్న సుమారు 8 మైళ్ల పొడవైన గడ్డి మైదానాలను తొలగించి, వాటి స్థానంలో అడవి పూలను పెంచారు. దీంతో సాధారణ రోడ్డు అంచులు రంగురంగుల పూలతో కళకళలాడే జీవవైవిధ్య మార్గాలుగా మారిపోయాయి. ఈ నిర్ణయం వల్ల ఏటా నిర్వహణ ఖర్చుల్లో సుమారు 25 వేల డాలర్లు ఆదా కావడంతో పాటు, తేనెటీగలు, సీతాకోకచిలుకలు, పక్షులు, ఇతర పరాగసంపర్క జీవులు తిరిగి ఆ ప్రాంతాలకు చేరుకున్నాయి. స్థానికులు ఈ అందమైన దృశ్యాన్ని పూల నదిగా పిలవడం ప్రారంభించారు. ప్రకృతిని కాపాడుతూ, ప్రభుత్వ ఖర్చులను కూడా తగ్గించవచ్చని ఈ కార్యక్రమం ప్రపంచంలోని అనేక ప్రాంతాలకు ఆదర్శంగా నిలిచింది.

## ఇండోనేషియాకు బ్రహ్మాస్త్ర

**ప్రధాని పర్యటనతో కుదిరిన ఒప్పందం.. చైనా దూకుడుకు మోదీ మాస్టర్ స్ట్రోక్**



భారత బ్రహ్మాస్త్రంగా పేరొందిన బ్రహ్మోస్ క్షిపణుల కొనుగోలు కోసం ఇండోనేసియా ఒప్పందం చేసుకుంది. చైనా జలాంతర్గామి నుంచి ఫసిపిక్ సముద్ర జలాల్లోకి క్షిపణిని ప్రయోగించిన రెండు రోజుల వ్యవధిలోనే భారత్, ఇండోనేసియా మధ్య ఒప్పందం కుదరడం గమనార్హం. ఈ మేరకు భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబొవో సుబియాంతో మధ్య మంగళవారం ఒప్పందం కుదిరింది.

జకార్తా: బ్రహ్మోస్, అస్త్ర మిస్సైళ్ల సరఫరాతోపాటు అరుదైన ఖనిజాల విషయంలో సహకారంపైనా ఇరు దేశాల మధ్య ఒప్పందాలు కుదిరాయి. అస్త్ర మిస్సైళ్లను భారత్ స్వదేశీ టెక్నాలజీతో అభివృద్ధి చేసింది. ఫిలిప్పిన్స్‌లాగే ఇండోనేసియా సైతం చైనా నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఇండోనేసియా పరిధిలోని నతునా దీవుల పరిధిలోకి చైనా నౌకలు చొరబడుతున్నాయి. దీంతో బ్రహ్మోస్ లాంటి అత్యాధునిక సూపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైళ్లు తన దగ్గర ఉంటే చైనా ఆ సాహసం చేయదని ఇండోనేసియా తరువాయి 2 వ పేజీలో...



## ఒక్క కారైనా పాడైందని నిరూపించగలరా?

**ఈ20 పెట్రోల్‌పై కేంద్రమంత్రి గడ్కరీ సవాల్**

**విమర్శలను పెయిడ్ ప్రచారం అని మండిపాటు**

దేశంలో 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఈ20) వినియోగం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయనే ఆరోపణలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తీవ్రంగా ఖండించారు. ఈ20 పెట్రోల్ కారణంగా కనీసం ఒక్క కారు పాడైందని నిరూపించాలని ఆయన విమర్శకులకు సవాల్ విసిరారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ ప్రచారాన్ని ఆయన "పెయిడ్ క్యాంపెయిన్"గా అభివర్ణించారు. ఇంధన దిగుమతుల కోసం దేశం ఏటా రూ. 22 లక్షల కోట్లు ఖర్చు చేస్తోందని, ఇథనాల్ ఉత్పత్తి ద్వారా రైతులకు రూ. 45,000 కోట్ల అదనపు ఆదాయం లభిస్తోందని ఆయన వివరించారు.

న్యూఢిల్లీ: ఇంధన దిగుమతులను తగ్గించుకుంటూ, పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ వాడకాన్ని వేగవంతం చేస్తోంది. నిర్దేశించుకున్న గడువు కంటే ముందే, 2026 ఏప్రిల్ నాటికి ఈ20 లక్ష్యాన్ని చేరుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం చెరకు పిప్పి, నూకలు, మొక్కజొన్నల నుంచి ఇథనాల్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. అయితే, ఈ మిశ్రమ పెట్రోల్ వాడకం వల్ల మైలేజీ తగ్గుతోందని, పాత వాహనాల ఇంజిన్లపై ఇది దీర్ఘకాలిక ప్రభావం చూపుతుందని సోషల్ మీడియా వేదికగా కొందరు వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం, వాహన తయారీ సంస్థలు ముక్తకంఠంతో తరువాయి 2 వ పేజీలో...



## వరదల బీభత్సం..

**మహారాష్ట్రలో జలవిలయం.. 13 మంది మృతి.. పలు ప్రాంతాల్లో రెడ్ అలర్ట్**

**ప్రమాద స్థాయిని దాటిన పలు నదులు.. లోనావాలాలో 48 గంటల్లో 625 మి.మీ.వర్షపాతం**

ముంబై: మహారాష్ట్రను భారీ వర్షాలు ముంచెత్తాయి. గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న కుండపోత వానలు, బలమైన ఈదురుగాలుల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 13 మంది మరణించగా, మరో 10 మంది గాయపడ్డారు. వందకు పైగా ఇళ్లు దెబ్బతినడంతో వందలాది మంది నిరాశ్రయులయ్యారని రాష్ట్ర విపత్తు నిర్వహణ కేంద్రం (ఎస్ఈఓసీ) తెలిపింది. గడిచిన 48 గంటల్లో రాష్ట్రంలోని తీరప్రాంత, పశ్చిమ ప్రాంతాల్లో వర్షాల తీవ్రత అత్యధికంగా ఉంది. పర్యాటక ప్రాంతమైన లోనావాలాలో గత 48 గంటల్లో ఏకంగా 625 తరువాయి 2 వ పేజీలో...

## కొండ చరియల వీరంగం..

**వయనాడ్‌లో ప్రకృతి ప్రకోపం**

**ఐదుగురు కార్మికుల మృతి**



భారీ వర్షాలకు వయనాడ్ జిల్లా మెప్పాడి సమీపంలోని కల్లాడి వద్ద కొండచరియలు విరిగిపడిన సంగతి తెలిసిందే. ఇవాళ (మంగళవారం) మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనలో ఐదుగురు కార్మికులు మృతిచెందగా, మట్టి కింద కూరుకుపోయిన ఆరుగురిని స్థానికులు రక్షించారు. శిథిలాల కింద చిక్కుకుపోయిన మరికొంతమంది కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.

వయనాడ్, జూలై 7: కేరళం: మలప్పురం, వయనాడ్ జిల్లాలను కలిపే సొరంగ మార్గం నిర్మాణ పనులు జరుగుతున్న మీనాక్షి వంతెన సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంపై కేరళం ముఖ్యమంత్రి వి.డి.సతీశన్ స్పందించారు. వెంటనే జిల్లా మంత్రులతో ఆయన అత్యవసర సమావేశం నిర్వహించారు. సహాయక, పునరావాస చర్యలను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించాలని ఆదేశించారు. వయనాడ్‌కు వెళ్లి సహాయక, పునరావాస తరువాయి 2 వ పేజీలో...



## సింగరేణికి మరో 2 బ్లాక్‌లు

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటన**

**నైనీ కోల్ బ్లాక్, తాడిచెర్ల-2 కేటాయింపు**

**బొగ్గు ఉత్పత్తి పెంచాలని సూచన**

**నైనీలో 35 ఏళ్లకు సరిపడా నిల్వలు**

**రూ.75 వేల కోట్ల ఆదాయం అంచనా**

## రాశి ఫలాలు

8.7.2026

మేషం: మానసిక ఉత్సాహం పెరుగుతుంది. కొత్త పనులకు శ్రీకారం చుడతారు. శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం మెరుగ ఉంటుంది. సమాజంలో గౌరవ ప్రతిష్టలు పెరుగుతాయి. అనుకున్న పనులు సకాలంలో పూర్తవుతాయి.

వృషభం: అనవసరపు ఖర్చులు పెరుగుతాయి. శారీరక అలసట చికాకు కలిగిస్తాయి. దూర ప్రయాణాలు వాయిదా వేసుకోవడం మంచిది. పనులలో కొంత ఆలస్యం జరిగే సూచనలు ఉన్నాయి. ఆర్థిక ఇబ్బందులు రాకుండా జాగ్రత్త పడాలి.

మిథునం: ఆకస్మిక ధనలాభాలు కలుగుతాయి. మిత్రుల ద్వారా ఆశించిన సహాయం అందుతుంది. దీర్ఘకాలిక కోరికలు నెరవేరుతాయి. వ్యాపారాలలో ఊహించని లాభాలు వస్తాయి. పెద్దల ఆశీస్సులు లభిస్తాయి.

కర్కాటకం: వృత్తి ఉద్యోగాలలో అనుకూల మార్పులు ఉంటాయి. అధికారుల నుండి ప్రశంసలు లభిస్తాయి. సమాజంలో మీ కీర్తి ప్రతిష్టలు పెరుగుతాయి. చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తి చేస్తారు.

సింహం: అదృష్టం కలిసి వస్తుంది. దైవ దర్శన భాగ్యం కలుగుతుంది. సుదూర ప్రయాణాలు లాభదాయకంగా సాగుతాయి. పితృస్వామ్య ఆస్తుల వివాదాలు సర్దుమణిగుతాయి. ఉన్నత విద్య అభ్యసించే వారికి అనుకూల సమయం.

కన్య: పనులలో ఆటంకాలు ఎదురవుతాయి. ఆరోగ్య విషయంలో మిక్కిలి జాగ్రత్త అవసరం. మానసిక ఒత్తిడి, ఆందోళన పెరుగుతాయి. ఎవరితోనూ అనవసర వివాదాలకు దిగవద్దు. వాహన ప్రయాణాలలో అప్రమత్తత అవసరం.

తుల: జీవిత భాగస్వామితో అనుబంధం బలపడుతుంది. భాగస్వామ్య వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. నూతన పరిచయాలు ఏర్పడతాయి. సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుంది. విందు వినోదాలలో పాల్గొంటారు.

వృశ్చికం: శత్రువులపై విజయం సాధిస్తారు. కోర్టు వ్యవహారాలు మీకు అనుకూలంగా మారుతాయి. పాత రుణాల నుండి ఉపశమనం లభిస్తుంది. ఆరోగ్య సమస్యలు తొలగిపోతాయి. ఉద్యోగంలో మీ ప్రతిభకు తగిన గుర్తింపు లభిస్తుంది.

ధనస్సు: సంతాన పరంగా శుభవార్తలు అందుతాయి. పనులలో విజయం సాధిస్తారు. నూతన ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. మిత్రులతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది.

మకరం: గృహ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. కొత్త వాహనం లేదా భూమి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. మిత్రుల ద్వారా లబ్ధి పొందుతారు. అనుకున్న పనులలో విజయం సాధించి మానసిక సంతోషాన్ని పొందుతారు.

కుంభం: మీ పరాక్రమం, ధైర్యం పెరుగుతాయి. తోబుట్టువుల నుండి ఊహించని సహాయం అందుతుంది. చిన్నపాటి ప్రయాణాలు లాభదాయకంగా ఉంటాయి. సమాచార రంగంలో ఉన్నవారికి అనుకూలమైన సమయం.

మీనం: ఆర్థిక లాభాలు ఆశాజనకంగా ఉంటాయి. మాట చాతుర్యంతో అందరినీ ఆకట్టుకుంటారు. కుటుంబంలో ఆనందకర వాతావరణం ఉంటుంది. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. సమాజంలో మీ మాటకు విలువ పెరుగుతుంది.



# కేసీఆర్ మెదడు కూలేశ్వరం

మొదటి పేజీ తరువాయి

నెలలో అప్పటి ముఖ్యమంత్రి ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి, మహారాష్ట్ర ప్రభుత్వంతో 148 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు నిర్మాణానికి ప్రాథమిక అవగాహనకు వచ్చినట్లు చెప్పారు. మొదట రూ.39 వేల కోట్ల అంచనాతో ప్రారంభమైన ఈ ప్రాజెక్టుపై తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి సుమారు రూ.6,150 కోట్లు, అనంతరం మరో రూ.5,523 కోట్లు ఖర్చు చేసిన తర్వాత ప్రాజెక్టు రూపకల్పనను మార్చారని వివరించారు. రీడిజైన్ కోసం 2015 జనవరి 21న ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మాణాన్ని సమర్థించలేదని, ఆ నివేదికను పక్కనపెట్టి ప్రభుత్వానికి అనుకూలంగా మరో నివేదికను పొందారని సీఎం ఆరోపించారు. అనంతరం ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.38 వేల కోట్ల నుంచి రూ.81 వేల కోట్లకు పెంచారని, అయితే నీటి లభ్యత గానీ, సాగునీటి విస్తీర్ణం గానీ పెరగలేదని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం ప్రాజెక్టును 2019 జూన్ 21న ప్రారంభించినప్పటికీ, ఏడాదిలోపే నిర్మాణ సమస్యలు బయటపడినట్లు సీఎం తెలిపారు. మేడిగడ్డ బరాజ్లో సీసీ బ్లాకులను పునరుద్ధరించాలని అప్పటి ఇంజనీర్ బీవీ రమణారెడ్డి 2020 మే 18న ప్రభుత్వానికి లేఖ రాసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. నిర్మాణ సంస్థ కూడా మరమ్మతులు చేపట్టకపోవడంతో సమస్యలు మరింత తీవ్రమయ్యాయని చెప్పారు. 2022లో గోదావరి వరదల సమయంలో కన్నెపల్లి పంప్‌హౌస్‌లు మునిగిపోగా, 2023 అక్టోబర్‌లో మేడిగడ్డ బరాజ్ ఆరు పిల్లర్లు కుంగిపోయాయని గుర్తు చేశారు. సాధారణంగా కొత్త బరాజ్‌లలో దశలవారీగా నీటిని నింపి పరీక్షలు నిర్వహిస్తారని, కానీ కాళేశ్వరం బరాజ్‌లను ప్రారంభించిన వెంటనే పూర్తిస్థాయిలో నీటితో నింపడం వల్ల ఒత్తిడి పెరిగిందని సీఎం విమర్శించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్ల నిర్మాణ ప్రాంతాల్లో తగిన భూగర్భ పరీక్షలు జరపలేదని, ఇసుక నేలపై నిర్మాణాలు చేపట్టడం కూడా సమస్యలకు కారణమైందని పేర్కొన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ప్రాథమిక నివేదికలోనూ నిర్మాణ నాణ్యత లోపాలు, నిర్వహణలో నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘనలే బరాజ్ దెబ్బతినడానికి కారణమని స్పష్టంగా పేర్కొన్నట్లు సీఎం వెల్లడించారు. ప్రస్తుతం ప్రభుత్వం నిపుణుల సహాయంతో ప్రాజెక్టును పునరుద్ధరించే చర్యలు చేపడుతోందని చెప్పారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుల వ్యాఖ్యలపైనా సీఎం స్పందించారు. కాళేశ్వరం అంశంపై అసెంబ్లీలో లేదా ఉభయ సభల సంయుక్త సమావేశంలో సమగ్ర చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ కోరిన తేదీకి సమావేశం ఏర్పాటు చేయడానికి అభ్యంతరం లేదని, స్పీకర్‌కు లేఖ రాస్తే తేదీ నిర్ణయిస్తామని తెలిపారు. ప్రాజెక్టును ఎలా పునరుద్ధరిస్తారో బీఆర్ఎస్ వివరించగలిగితే మరమ్మతుల బాధ్యతలను కూడా అప్పగించేందుకు సిద్ధమని వ్యాఖ్యానించారు. రాష్ట్రం అప్పుల భారం పెరగడానికి గత ప్రభుత్వ విధానాలే కారణమని సీఎం ఆరోపించారు. కాళేశ్వరం పేరుతో భారీగా ప్రజాధనం ఖర్చు చేసి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు నష్టం కలిగించారని, ఈ వ్యవహారంలో బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంపై న్యాయ విచారణ కొనసాగుతోందని, జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలోని కమిషన్ ఇప్పటికే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు పలువురు అధికారులను విచారణకు పిలిచిందని సీఎం తెలిపారు. కమిషన్ తుది నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఇండోనేషియాకు బ్రహ్మోస్త్ర

మొదటి పేజీ తరువాయి

భావిస్తోంది. అందుకే భారత్ దగ్గర్నుంచి వాటిని పొందేందుకు ఒప్పందం చేసుకుంది. మరో వైపు వియత్నాం కూడా బ్రహ్మోస్ క్షిపణుల కోసం భారత్‌తో చర్చలు జరుపుతోంది. దాదాపు వారం రోజుల, మూడు దేశాల పర్యటనను ఇండోనేసియా టూర్‌తో ప్రారంభించిన ప్రధాని మోదీ.. ఆ తర్వాత ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాలకు వెళ్లనున్నారు. ఆర్థిక, భద్రతాపరమైన సహకారం కోసం.. రక్షణ ఒప్పందాలను బలోపేతం చేయడం, టెక్నాలజీలో సహకారం, రేర్ ఎర్త్ మినరల్స్ తదితరాల కోసం ప్రధాని మోదీ ఈ పర్యటన చేపడుతున్నారు. జకార్తాలో ఇండోనేసియా అధ్యక్షుడు ప్రబొవో, ప్రధాని మోదీ సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. హిందూ మహాసముద్రంలో నౌకల భద్రత, రక్షణ కోసం ఇరు దేశాలకు చెందిన కోస్ట్ గార్డ్ దళాలు కలిసి పని చేస్తాయన్నారు. బ్రహ్మోస్ మిస్సైళ్ల కోసం ఇండోనేసియా రక్షణ శాఖ.. భారత్, రష్యా జాయింట్ వెంచర్ అయిన బ్రహ్మోస్ ఏరోస్పేస్‌తో ఒప్పందం చేసుకోగా.. అస్త్ర మిస్సైళ్ల కోసం భారత్ డైనమిక్ లిమిటెడ్‌తో ఇండోనేసియాకు చెందిన ప్రయివేట్ డిఫెన్స్ కంపెనీ రిపబ్లిక్‌కార్ప్ ఒప్పందంపై సంతకాలు చేసింది. చారిత్రక పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీకి ఇండోనేషియా తమ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన 'బింటాంగ్ ఆదిపుర్ణ ఆఫ్ ది రిపబ్లిక్ ఆఫ్ ఇండోనేషియా'ను ప్రదానం చేసి అరుదైన గౌరవాన్ని అందించింది. జకార్తా పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో ఈ ఒప్పందాలు కుదిరాయి. రక్షణ రంగంలో సహకారం ఈ ఒప్పందాల్లో ప్రధానంగా నిలిచింది. సముద్ర భద్రత, భద్రతా సహకారంపై ఉన్న అవగాహన ఒప్పందాన్ని ఇరు దేశాలు పొడిగించాయి. దీనికితోడు, ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణి వ్యవస్థను అందించేందుకు ఒక రక్షణ కాంట్రాక్టుపై సంతకాలు జరిగాయి. అదేవిధంగా, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్), ఇండోనేషియాకు చెందిన రిపబ్లికోర్ప్ మధ్య గగనతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే క్షిపణుల సహకారంపైనా ఒక ఒప్పందం కుదిరింది. ఈ సందర్భంగా, జకార్తాలోని అధ్యక్ష భవనంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో.. ప్రధాని మోదీకి 'బింటాంగ్ ఆదిపుర్ణ' పురస్కారాన్ని స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ప్రబోవో మాట్లాడుతూ.. "ఇండో-పసిఫిక్ ప్రాంతంలో స్థిరత్వాన్ని నెలకొల్పే శక్తిగా భారత్ పోషిస్తున్న కీలక పాత్రకు, ద్వైపాక్షిక సంబంధాలను మార్చడంలో ప్రధాని మోదీ వ్యక్తిగత నాయకత్వానికి ఈ పురస్కారం ఒక గుర్తింపు. మా గణతంత్రం అందించే అత్యున్నత పురస్కారం ఇది.

# తాజ్ మహాలా.. తేజో మహాలా

మొదటి పేజీ తరువాయి

తీసుకోవాలని అధికారికంగా పేర్కొన్నారు. తాజ్ మహల్ ప్రాంగణంలో శాస్త్రీయ పరిశీలనలు, సర్వేచేయాలన్న డిమాండ్‌ను దిగువ కోర్టులు గతంలో తిరస్కరించాయి. సోమవారం జరిగిన విచారణలో సీనియర్ న్యాయవాది హరి శంకర్ జైన్ పిటిషనర్ల తరఫున వాదనలు వినిపించారు. మతపరమైన చిహ్నాలు, నిర్మాణ అవశేషాలను గుర్తించడానికి సమగ్రమైన, శాస్త్రీయమైన, భౌతిక సర్వే నిర్వహించకుండా కచ్చితమైన చారిత్రక విశ్లేషణ చేయడం సాధ్యం కాదని వాదించారు. ప్రభుత్వం, భారత పురావస్తు శాఖ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్, న్యాయవాది మనోజ్ కుమార్ సింగ్ హాజరయ్యారు. ఈ రిట్ పిటిషన్ 2015లో ఆగ్రాలోని స్థానిక కోర్టుల్లో ఒక సుదీర్ఘ న్యాయ పోరాటం నుంచి మొదలైంది. పిటిషనర్లు అప్పుడు సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని ఆర్డర్ 26 రూల్ 9 కింద ఒక అడ్వకేట్ కమిషనర్‌ను నియమించాలని కోరుతూ ఒక సివిల్ దావాను వేశారు. హిందూ మతపరమైన చిహ్నాలు, నిర్మాణ శైలికి సంబంధించిన ఆధారాల నమోదు, స్థానిక తనిఖీలు (లోకల్ ఇన్‌స్పెక్షన్) నిర్వహించడమే ఈ వ్యాజ్యం ప్రధాన ఉద్దేశం. అయితే, ఆగ్రా సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) జులై 18, 2019న సాంకేతిక కారణాలతో ఆ దరఖాస్తును తిరస్కరించారు. అయితే, దీనిని కొనసాగించాలని నిశ్చయించుకున్న పిటిషనర్లు... జిల్లా కోర్టులో రివిజన్ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఏప్రిల్ 4, 2026న ఆగ్రా అదనపు జిల్లా జడ్జి, ఆ రివిజన్ పిటిషన్ చట్ట ప్రకారం విచారణకు యోగ్యం కాదని తీర్పునిస్తూ దానిని కొట్టివేశారు. దీంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 277 ప్రకారం పిటిషనర్లు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. ఆ స్థలం చారిత్రక వాస్తవాన్ని నిర్ధారించడానికి అవసరమైన అత్యంత కీలక భౌతిక ఆధారాల సేకరణను దిగువ కోర్టుల అడ్డుకున్నాయని తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో వేగంగా చర్యలు తీసుకోవాలని భావించిన హైకోర్టు... ఈ నోటీసుల జారీ ప్రక్రియను 10 రోజులలోగా పూర్తి చేయాలని ఆదేశించింది. దీంతో పాటుగా తదుపరి విచారణ సమయానికి కేంద్ర ప్రభుత్వం, ఏఎస్ఐ సహా ప్రతివాదులు అందరికీ కౌంటర్ దాఖలు చేయడానికి మధ్యంతర అనుమతిని ఇస్తూ హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది.

# ఒక్క కారైనా పాడైందని నిరూపించగలరా?

మొదటి పేజీ తరువాయి

తోసిపుచ్చుతున్నాయి. ఇథనాల్ కలపడం వల్ల మైలేజీలో 2 నుంచి 5 శాతం వరకు స్వల్ప తగ్గుదల ఉండవచ్చుని, అంతకు మించి ఇంజిన్‌కు ఎలాంటి ప్రమాదం ఉండదని పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి గతంలోనే స్పష్టం చేశారు. మారుతి సుజుకి, టయోటా, హీరో మోటోకార్ప్ వంటి ప్రముఖ సంస్థలు సైతం ఈ20 వినియోగానికి మద్దతు తెలిపాయి. లక్షలాది పాత వాహనాలకు సర్వీసింగ్ నిర్వహించినా, ఇథనాల్ వల్ల తలెత్తిన సమస్యలు ఏవీ గుర్తించలేదని మారుతి సుజుకి వెల్లడించింది. కల్తీ ఇంధనం వల్ల పాడైన కారును చూపిస్తూ, అది ఈ20 ప్రభావమేనని ప్రచారం చేస్తున్న ఒక వైరల్ వీడియోను టయోటా సంస్థ ఇప్పటికే ఖండించింది.

# సింగరేణికి మరో 2 బ్లాక్‌లు

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటన**

**నైనీ కోల్ బ్లాక్, తాడిచెర్ల-2 కేటాయింపు**

**రూ.75 వేల కోట్ల ఆదాయం అంచనా**

న్యూఢిల్లీ/హైదరాబాద్, జూలై 7 (ఈవార్తలు): సింగరేణికి మరో రెండు కీలక బొగ్గు బ్లాక్‌లు దక్కనున్నాయి. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్‌తో పాటు తాడిచెర్ల-2 కోల్ బ్లాక్‌ను కూడా సింగరేణికి కేటాయిస్తున్నట్లు కేంద్ర బొగ్గు శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఈ నిర్ణయం సంస్థ భవిష్యత్తుకు పెద్ద ఊరటనిస్తుందని చెప్పారు. ఢిల్లీలో మంగళవారం మాట్లాడిన కిషన్ రెడ్డి సింగరేణికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందన్నారు. బొగ్గు ఉత్పత్తిని మరింత పెంచాల్సిన అవసరం ఉందని సూచించారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కేలా కేంద్రం చొరవ తీసుకుందని వెల్లడించారు. ఇతర రాష్ట్రాల్లో జరిగే బొగ్గు బ్లాక్‌ల వేలంలోనూ సింగరేణి పాల్గొనేలా తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నైనీ కోల్ బ్లాక్‌లో మరో 35 ఏళ్లకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని కిషన్‌రెడ్డి చెప్పారు. దీని వల్ల సింగరేణికి సుమారు రూ.75 వేల కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. తెలంగాణలో లక్షలాది కుటుంబాల జీవనాధారం సింగరేణి అని పేర్కొన్నారు. తాడిచెర్ల-2 కోల్ బ్లాక్‌ను కూడా సింగరేణికే కేటాయించాలని కేంద్రం నిర్ణయం తీసుకుందని వెల్లడించారు. ఈ బ్లాక్‌తో సంస్థ కార్యకలాపాలు మరింత బలోపేతం అవుతాయన్నారు. భవిష్యత్తులో ఉత్పత్తి పెరగడానికి ఇది దోహదపడుతుందని తెలిపారు.

# వరదల బీభత్సం..

మొదటి పేజీ తరువాయి

మిల్లీమీటర్ల (24.71 అంగుళాలు) రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. రాయ్‌గఢ్‌లో 236 మి.మీ., ఠాణేలో 161 మి.మీ., రత్నగిరిలో 152 మి.మీ., ముంబైలో 100 నుంచి 161 మి.మీ. వరకు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఈ వర్షాల ధాటికి రాష్ట్రంలోని జలాశయాలు వేగంగా నిండిపోతున్నాయి. అంబా, సావిత్రి, కుండలిక, పాతాళగంగ, ఉల్హాస్ సహా పలు నదులు ప్రమాద స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. దీంతో బద్లాపూర్, మోహనే, జాంభూల్‌పాడ ప్రాంతాల్లో వరద హెచ్చరికలు జారీ చేశారు. వర్షాల కారణంగా పలుచోట్ల విషాద సంఘటనలు చోటుచేసుకున్నాయి. ముంబైలోని మాన్‌ఖుర్ద్ ప్రాంతంలో ఓ భవనం మురికివాడపై కూలిపోవడంతో ఆరుగురు మరణించగా, మరొకరు గాయపడ్డారు. చెట్టు కూలి ఒకరు, నీట మునిగి పాల్ఘర్, సింధుదుర్గ్‌లలో చెరొకరు ప్రాణాలు కోల్పోయారు. సతారాలో కొండచరియలు విరిగిపడటంతో ఒకరు మృతి చెందగా, నలుగురు గాయపడ్డారు. భారీ వర్షాల నేపథ్యంలో మాథెరన్, లోనావాలా, ఖోపోలి వంటి హిల్ స్టేషన్లలో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉండటంతో 'రెడ్ అలర్ట్' ప్రకటించారు. సహాయక చర్యల కోసం రెండు జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలను మోహరించారు. తలేగావ్-దాభాడే సమీపంలో వరద నీటిలో చిక్కుకున్న 25 మంది ప్రయాణికులతో ఉన్న బస్సును ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. రాయ్‌గఢ్ జిల్లాలో ఇంటి పైకప్పుపై చిక్కుకుపోయిన ఆరుగురు కుటుంబ సభ్యులను పడవల సాయంతో రక్షించారు. ముంబై-గోవా, ముంబై-పుణె ఎక్స్‌ప్రెస్‌వేలపై కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మహారాష్ట్రలోని ఒక భాగం ఇలా జలవిలయంతో అల్లాడుతుండగా, మరోవైపు విదర్భ ప్రాంతం మాత్రం వర్షాల కోసం ఎదురుచూస్తోంది. వార్ధా, అకోలా, అమరావతి, యవత్‌మాల్, చంద్రపూర్ జిల్లాల్లో ఇప్పటివరకు వర్షాలు కురవకపోవడం గమనార్హం.

# కొండ చరియల వీరంగం..

మొదటి పేజీ తరువాయి

చర్యలను పర్యవేక్షించాలని మంత్రులు అనిల్ కుమార్, సిద్ధిక్‌కు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఉన్నతాధికారులు అగ్నిమాపక, పోలీసు, జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్‌డీఆర్ఎఫ్) బృందాలను రంగంలోకి దింపి సహాయక చర్యలు చేపట్టారు. వయనాడ్‌లో సోమవారం నుంచి భారీ వర్షాలు పడుతుండగా సొరంగం పనులను అదే రోజు నుంచి ప్రాజెక్టు అధికారులు నిలిపివేశారు. ఆ ప్రాంతంలో 24 గంటల వ్యవధిలోనే సుమారు 265 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావడంతో ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడ్డాయి. సొరంగ మార్గం ప్రాజెక్టు కోసం పని చేసే కార్మికులు నివసించే వసతి గృహంపై కొండచరియలు పడ్డాయి. అలాగే, కొన్ని నివాస గృహాలు, హోమ్‌స్టేలపైనా భారీగా మట్టి, రాళ్లు వచ్చిపడ్డాయి.

# కవిత వాదన వినాలి

మొదటి పేజీ తరువాయి

ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఈ పేరు పాత టీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సమితి.. ప్రస్తుతం బీఆర్ఎస్) పేరును పోలి ఉండేలా, అదే అర్థం వచ్చేలా ఉందంటూ ఈసీ జూన్ 23వ తేదీన కవితకు ఒక లేఖ పంపింది. కొత్త పార్టీకి ప్రత్యామ్నాయ పేర్లను సూచించాలే తప్ప.. పాత టీఆర్ఎస్ గుర్తులను పోలిన విధంగా ఎలాంటి పేర్లు ఉండకూడదని ఆ లేఖలో ఈసీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఎన్నికల సంఘం పంపిన ఈ లేఖను సవాల్ చేస్తూ.. తమ పార్టీ పేరును తక్షణమే ఖరారు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ కవిత ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఢిల్లీ హైకోర్టు ధర్మాసనం.. ఎన్నికల సంఘం నిర్ణయాన్ని సమర్థించింది. 'తెలంగాణ రక్షణ సమితి' లేదా 'తెలంగాణ రక్షణ సేన' అనే పేర్లు పాత 'టీఆర్ఎస్' పార్టీకి దగ్గరగా ఉన్నాయనే ఈసీ అభ్యంతరంలో హేతుబద్ధత ఉందని న్యాయస్థానం అభిప్రాయపడింది.

# గిట్లుంటదా?

మొదటి పేజీ తరువాయి

సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రోటోకాల్ ఉల్లంఘనపై ఆమె నేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మూడు పేజీల లేఖ రాస్తూ అధికారికంగా ఫిర్యాదు చేశారు. కడియం శ్రీహరి ప్రభుత్వ పరిపాలనా విధానాలను, మంత్రిగా తన అధికార పరిధిని పూర్తిగా బేఖాతరు చేశారని ఆమె సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దేవాదాయ శాఖకు సంబంధించిన పరిపాలన, కీలక నిర్ణయాలు, అధికారిక సమీక్షలన్నీ పూర్తిగా సంబంధిత శాఖా మంత్రి పరిధిలోకే వస్తాయని కొండా సురేఖ స్పష్టం చేశారు. కానీ, ఎమ్మెల్యే కడియం శ్రీహరి దేవాదాయ శాఖ డైరెక్టర్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులను పిలిపించుకుని... దేవాలయాల అభివృద్ధి, నిధుల కేటాయింపులు, మాస్టర్ ప్లాన్ల రూపకల్పన, భూముల పరిరక్షణ వంటి అంశాలపై సమీక్ష చేశారని లేఖలో మండిపడ్డారు. అంతేకాకుండా అధికారులకు డెడ్‌లైన్లు కూడా పెట్టడం పరిపాలనా పరంగా తీవ్ర అభ్యంతరకరమని, ఇది ప్రభుత్వ 'రూల్స్ ఆఫ్ బిజినెస్' స్ఫూర్తిని నిలువునా ఉల్లంఘించడమేనని తేల్చిచెప్పారు. రాజకీయాల్లో ఎంతో అనుభవం ఉన్న కడియం శ్రీహరికి... శాఖా పరమైన నిర్ణయాలు మంత్రి ఆధ్వర్యంలోనే జరగాలనే కనీస విషయం తెలియదా అని కొండా సురేఖ నిలదీశారు. తనను పూర్తిగా పక్కనపెట్టి ఇలాంటి సమీక్షలు చేయడం ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో చెడు సంప్రదాయానికి దారితీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇవి అధికార యంత్రాంగంలో తీవ్ర అయోమయానికి కారణమవుతాయన్నారు.

## తెలంగాణ భూములపై కుట్ర: ఆరెస్పీ

హైదరాబాద్, జూలై 7 (ఈవార్తలు): తెలంగాణలో రైతులు, భూమి యజమానుల ఆస్తులపై భారీ కుట్ర జరుగుతోందని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆర్థికంగా, భూమి హక్కుల పరంగా దెబ్బతీస్తోందని విమర్శించారు. ఒకవైపు, కాళేశ్వరం ప్రాజెక్టులో నీళ్లున్నా కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లు ఆన్ చేయకుండా రైతుల పొలాలకు నీరు అందకుండా చేస్తున్నారని... మరోవైపు, భూభారతి పోర్టల్ ద్వారా అక్రమ భూమి బదిలీలు జరుపుతున్నారని ఆరోపించారు. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ పోర్టల్‌లో దాదాపు 22 వేల భూ బదిలీలు అక్రమంగా జరిగాయని, రైతులకు తెలియకుండానే వారి భూములు ఇతరులకు మార్చేశారని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. నిషేధిత జాబితా భూములు, అసైన్డ్ భూములు, ప్రభుత్వ భూములను కూడా సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసి తమ ఇష్టానికి బదలాయించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ తెచ్చిన ధరణి పోర్టల్ బాగా పని చేస్తుండగా, కాంగ్రెస్ వచ్చాక భూమాఫియా రాజ్యం మొదలైందని విమర్శించారు. హైదరాబాద్ చుట్టుపక్కల భూకబ్జాలు పెరిగాయని, రైతుల ఆస్తులను కాపాడుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## కేటీఆర్ కుమారుడికి స్వల్ప గాయం.. కేసీఆర్ పరామర్శ

హైదరాబాద్, జూలై 7 (ఈవార్తలు): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కుమారుడు, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మనవడు హిమాన్షు రావు ప్రమాదవశాత్తు గాయపడ్డాడు. నిన్న సాయంత్రం జిమ్‌లో వ్యాయామం చేస్తుండగా అతడి ముక్కుకు స్వల్ప గాయమైంది. దీంతో కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వైద్యులు హిమాన్షుకు అవసరమైన చికిత్స అందిస్తున్నారు. కుమారుడికి గాయమైందన్న సమాచారం అందుకున్న కేటీఆర్, బీఆర్ఎస్ సీనియర్ నేత టి. హరీశ్ రావుతో కలిసి వెంటనే ఆసుపత్రికి చేరుకున్నారు. హిమాన్షు ఆరోగ్య పరిస్థితిపై వారు వైద్యులను అడిగి ఆరా తీశారు. మనవడు గాయపడిన విషయం తెలిసిన వెంటనే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా పరామర్శించేందుకు ఆసుపత్రికి బయలుదేరారు. తాను కోలుకుంటున్నానని హిమాన్షు 'ఎక్స్' వేదికగా తెలిపారు. చిన్నపాటి గాయం కావడంతో గత రాత్రి ఆసుపత్రిలో చేరానని తెలిపారు. పూర్తిగా కోలుకోవడానికి కొంత సమయం పడుతుందని వైద్యులు సూచించారని పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం హిమాన్షుకు చిన్నపాటి గాయమైందని, ఆసుపత్రిలో చికిత్స కొనసాగుతోందని కేటీఆర్ కూడా సామాజిక మాధ్యమ వేదికగా వెల్లడించారు. హిమాన్షు ఆరోగ్యంపై ఆరా తీసిన వారికి కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు.

## డైరీలో డీఎస్పీ భీంరెడ్డి ఆస్తులు చిట్టా

**బట్టబయలైన వందల కోట్ల అక్రమాస్తులు!**

హైదరాబాద్, జూలై 7 (ఈవార్తలు): ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణలతో సంచలనం సృష్టించిన తెలంగాణ డీఎస్పీ సంకిరెడ్డి భీమ్ రెడ్డిని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిన్న సాయంత్రం అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్‌లో (పీసీఎస్) డీఎస్పీగా పనిచేస్తున్న ఆయన్ను, ఇబ్రహీంబాద్‌లోని వెసెల్లా మీడోస్‌లో ఉన్న నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. ఆయనను ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. తన సర్వీసు కాలంలో అవినీతి, అక్రమ మార్గాల ద్వారా భీమ్ రెడ్డి భారీగా ఆస్తులు కూడబెట్టినట్లు ఏసీబీ తన అభియోగాల్లో పేర్కొంది. ఈ కేసు దర్యాప్తులో భీమ్ రెడ్డి చేతిరాతతో ఉన్న ఒక వ్యక్తిగత డైరీ అత్యంత కీలకమైన సాక్ష్యంగా మారింది. జులై 2న ఏసీబీ అధికారులు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లోని ఆయన బంధువులు, స్నేహితులు, బినామీలకు సంబంధించిన మొత్తం 16 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లోనే భీమ్ రెడ్డికి చెందిన డైరీ లభించింది. ఈ డైరీలో తన ఆస్తులు, పెట్టుబడులు, బినామీల పేర్లను ఆయన స్వయంగా రాసుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఆసక్తికరంగా, మే నెలలో చార్‌ధామ్ యాత్రకు తన భార్యతో కలిసి వెళ్లే ముందు ఆయన ఈ డైరీని రాసి, దాని స్కాన్ కాపీలను తన ఇద్దరు కుమారులకు వాట్సాప్ ద్వారా పంపినట్లు దర్యాప్తులో తేలింది. ఈ డైరీ ఆధారంగానే ఏసీబీ అధికారులు అనేక ఆస్తులు, ఆర్థిక లావాదేవీలను గుర్తించగలిగారు.

## చైనాలో భారీ అవినీతి.. అధికారికి మరణశిక్ష

బీజింగ్: చైనాలో భారీ అవినీతి కేసులో మాజీ ఆర్థికాభివృద్ధి అధికారి యాంగ్ యూలిన్‌కు కోర్టు మరణశిక్ష విధించింది. మూడు దశాబ్దాల పాటు అధికారాన్ని అడ్డం పెట్టుకుని రూ.2,800 కోట్లు లంచాల రూపంలో స్వీకరించినట్లు కోర్టు తేల్చింది. ఇటీవలి కాలంలో చైనాలో వెలుగుచూసిన అతిపెద్ద అవినీతి కేసుల్లో ఇదొకటిగా నిలిచింది. యాంగ్ యూలిన్ 1993 నుంచి 2023 వరకు పలు ప్రాజెక్టులు, వ్యాపార అనుమతులు, భూముల కేటాయింపులు, వర్కింగ్ క్యాపిటల్‌కు సంబంధించిన అంశాల్లో సాయం చేస్తూ భారీగా లంచాలు తీసుకున్నట్లు చాంగ్‌జౌ ఇంటర్మీడియట్ పీపుల్స్ కోర్టు వెల్లడించింది. లంచాలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ నిధుల దుర్వినియోగం, ప్రజాధనాన్ని మళ్లించడం, అధికార దుర్వినియోగం, మనీలాండరింగ్, లంచాలు ఇవ్వడం వంటి ఆరోపణల్లోనూ ఆయన దోషిగా తేలాడు. కోర్టు విచారణలో తన తప్పును అంగీకరించి పశ్చాత్తాపం వ్యక్తం చేసినట్లు న్యాయస్థానం తెలిపింది. ఈ కేసు అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ చేపట్టిన అవినీతి వ్యతిరేక ఉద్యమంలో భాగంగా వెలుగులోకి వచ్చింది. అయితే ఈ ఉద్యమాన్ని రాజకీయ ప్రత్యర్థులను పక్కన పెట్టేందుకూ ఉపయోగిస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. మార్చి, ఏప్రిల్‌లో ఈ కేసుపై బహిరంగ విచారణలు జరిగాయి. యాంగ్‌కు చెందిన వ్యక్తిగత ఆస్తులన్నీ స్వాధీనం చేసుకోవాలని, లంచాల రూపంలో పొందిన మొత్తం సొమ్మును తిరిగి రాబట్టాలని కోర్టు ఆదేశించింది. ఇటీవల చైనాలో అవినీతి కేసుల్లో మరణశిక్ష ఎదుర్కొన్న అధికారుల్లో యాంగ్ కూడా ఒకరు. 2021లో ప్రభుత్వ రంగ సంస్థ మాజీ అధికారి లై షియామిన్‌ను ఉరి తీశారు. 2024లో ఇన్నర్ మంగోలియాకు చెందిన మాజీ అధికారి లీ జియాన్‌పింగ్‌కు కూడా మరణశిక్ష అమలు చేశారు.

## రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక ఆత్మహత్య

జనగామ, జూలై 7 (ఈవార్తలు): కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి మరో విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన జనగామ జిల్లా కేంద్రంలోని పూర్ణిమ కాలనీలో చోటు చేసుకుంది. రిటైర్డ్ టీచర్ పగిడిపల్లి మల్లయ్యకు పదవీ విరమణ ప్రయోజనాలు సకాలంలో అందకపోవడం, ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై తన ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తనకు రావాల్సిన 10,77,528 రూపాయలను 21 నెలలు గడిచినా ప్రభుత్వం చెల్లించలేదు. అలాగే పలువురు బంధువులు కూడా తీసుకున్న అప్పులు తిరిగి ఇవ్వకపోవడం, తను తీసుకున్న అప్పులకు వడ్డీలు కట్టలేక, వారి వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకున్నట్లు సుమారు 20 పేజీల సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.



# బగ్రామ్ ఎయిర్‌బేస్ తిరిగి ఇచ్చేదేలే

**ట్రంప్ డిమాండ్‌ను తిరస్కరించిన ఆఫ్ఘన్ మంత్రి**

**సరిహద్దు ఉద్రిక్తతలపై పాకిస్థాన్‌కు తీవ్ర హెచ్చరిక**

**భారత్‌తో వాణిజ్య సంబంధాలు పెంచుకుంటామని వెల్లడి**

కాబూల్: ఆఫ్ఘనిస్థాన్‌లోని బగ్రామ్ ఎయిర్‌బేస్‌ను తిరిగి తమ అధీనంలోకి తీసుకుంటామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కోరికను తాలిబన్ ప్రభుత్వం తీవ్రంగా తిరస్కరించింది. సరిహద్దు ఉద్రిక్తతల నేపథ్యంలో పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరికలు జారీ చేసింది. అదే సమయంలో భారత్‌తో వాణిజ్య సంబంధాలను విస్తరించుకోవడానికి ఆసక్తిగా ఉన్నామని సంకేతాలిచ్చింది. ఇండియా టుడేకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో తాలిబన్ సమాచార, సాంస్కృతిక శాఖ మంత్రి ముహాజిర్ ఫరాహీ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. బగ్రామ్ వైమానిక స్థావరాన్ని అమెరికా తిరిగి పొందడం కేవలం "కలల్లోనే సాధ్యం" అని ఆయన స్పష్టం చేశారు. 2021లో అమెరికా సేనలు వెనక్కి వెళ్లాక బగ్రామ్ స్థావరం తాలిబన్ల ఆధీనంలోకి వచ్చింది. చైనాకు సమీపంలో వ్యూహాత్మకంగా కీలకమైన ఈ స్థావరాన్ని తిరిగి పొందాలని ట్రంప్ పలుమార్లు వ్యాఖ్యానించారు. పాకిస్థాన్‌తో పెరుగుతున్న ఘర్షణలపై ఫరాహీ తీవ్రంగా స్పందించారు. ఇటీవల పాక్ చర్యలకు తాము బలమైన సమాధానం ఇచ్చామని, తమ సార్వభౌమత్వాన్ని కాపాడుకునేందుకు ఏ స్థాయి వరకైనా వెళతామని హెచ్చరించారు. జూన్ చివరిలో ఆఫ్ఘన్ భూభాగంలోని ఉగ్రవాద స్థావరాలపై పాకిస్థాన్ వైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో 38 మంది పౌరులు మరణించారని ఆఫ్ఘన్ అధికారులు ఆరోపించగా, 29 మంది ఉగ్రవాదులను హతమార్చినట్లు పాక్ ప్రకటించింది. మరోవైపు, భారత్‌తో తమకు చారిత్రక సంబంధాలు ఉన్నాయని ఫరాహీ గుర్తుచేశారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం, ప్రజల మధ్య సంబంధాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. తరచూ సరిహద్దులు మూసివేస్తున్న పాకిస్థాన్‌పై ఆధారపడకుండా ఇరాన్, భారత్, చైనా ద్వారా వాణిజ్య మార్గాలను విస్తరించుకుంటున్నామని తెలిపారు. కాబుల్‌లో అమెరికాపై సాధించిన విజయానికి గుర్తుగా ఓ యుద్ధ మ్యూజియం ఏర్పాటు చేయనున్నట్లు కూడా ఆయన వెల్లడించారు.

# సిట్ నివేదిక వచ్చాకే మాట్లాడతా

**అయోధ్య ట్రస్టు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్**



అయోధ్య: అయోధ్య రామమందిరం విరాళాల చోరీ ఆరోపణలపై శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ స్పందించారు. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన తుది నివేదికను సమర్పించిన అనంతరమే ఈ ఆరోపణలపై పూర్తిస్థాయిలో సమాధానమిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం రామభక్తులను ఉద్దేశించి ఆయన ఒక లేఖ విడుదల చేశారు. ప్రస్తుతం విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో మౌనంగా ఉండటమే శ్రేయస్కరమని భావిస్తున్నట్లు తెలిపారు. తన ప్రజా జీవితం ఒక తెరిచిన పుస్తకమని చంపత్ రాయ్ ఆ లేఖలో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ట్రస్ట్ కోశాధికారి స్వామి గోవింద్ దేవ్ గిరి స్పందిస్తూ, చంపత్ రాయ్‌ను ఆయన నమ్మిన వ్యక్తులే మోసం చేశారని, ఇందులో ట్రస్టీల ప్రమేయం ఏమీ లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం సిట్ దర్యాప్తు పురోగతిలో ఉందని తెలిపారు. వాస్తవాలను వెలికితీసి, దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఇప్పటికే హామీ ఇచ్చారు. జూన్ ప్రారంభంలో ఆలయ హుండీ నగదు లెక్కింపులో భారీగా అవకతవకలు జరిగినట్లు వార్తలు వెలువడటంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. సీసీటీవీ నిఘా లోపం, సిబ్బందిపై సరైన తనిఖీలు లేకపోవడం, కొందరు ఉద్యోగులు నగదును దారిమళ్లించడం వంటి అంశాలను సిట్ తన ప్రాథమిక నివేదికలో గుర్తించినట్లు సమాచారం. ఈ క్రమంలో దాదాపు రూ. 7 నుంచి 8 కోట్ల వరకు నిధులు గల్లంతైనట్లు అంచనా వేస్తున్నారు. ట్రస్ట్ సభ్యుడి ఫిర్యాదు మేరకు జూన్ 25న ఉత్తరప్రదేశ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నగదు లెక్కింపు సిబ్బందితో పాటు చంపత్ రాయ్ మాజీ డ్రైవర్ సహా మొత్తం ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివాదం తీవ్రం కావడంతో జూలై 6న సమావేశమైన ట్రస్ట్, చంపత్ రాయ్, మరో ట్రస్టీ అనిల్ మిశ్రా సమర్పించిన రాజీనామాలను ఆమోదించింది.

# తిరుపతి, అరుణాచలం, శ్రీరంగానికి నేరుగా రైలు

**చర్లపల్లి-తిరుచ్చి మధ్య వారానికి ఒకసారి ప్రత్యేక సర్వీస్**

**ప్రతి మంగళవారం బయలుదేరనున్న రైలు**

**ఏసీ, స్లీపర్, జనరల్ కోచ్‌లతో కూడిన 22 బోగీల రైలు**



హైదరాబాద్, జూలై 7 (ఈవార్తలు): దక్షిణ భారతదేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుపతి, అరుణాచలం (తిరువణ్ణామలై), శ్రీరంగం సందర్శించాలనుకునే భక్తులకు దక్షిణ మధ్య రైల్వే శుభవార్త అందించింది. హైదరాబాద్‌లోని చెర్లపల్లి నుంచి తిరుచ్చి (తిరుచిరాపల్లి) వరకు నూతన వీక్లీ ప్రత్యేక రైలు సేవలను మంగళవారం నుంచి ప్రారంభించింది. ఈ రైలు సౌకర్యంతో భక్తులు ఒకే ప్రయాణంలో ఈ మూడు ముఖ్యమైన క్షేత్రాలను ఎంతో సులభంగా సందర్శించుకోవచ్చు. రైలు నంబర్ 17077 ప్రతి మంగళవారం సాయంత్రం 5:20 గంటలకు చెర్లపల్లిలో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 8:50 గంటలకు తిరుపతికి, మధ్యాహ్నం 1:20 గంటలకు తిరువణ్ణామలైకి, సాయంత్రం 4:30 గంటలకు శ్రీరంగానికి చేరుకుంటుంది. అనంతరం సాయంత్రం 6:45 గంటలకు తిరుచిరాపల్లికి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో, రైలు నంబర్ 17078 ప్రతి బుధవారం రాత్రి 9:30 గంటలకు తిరుచ్చిలో బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 10:20 గంటలకు చెర్లపల్లికి చేరుకుంటుంది. హైదరాబాద్ నుంచి తిరుపతికి ఇప్పటికే సుమారు 20 రైళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ, అరుణాచలానికి నేరుగా రైలు సౌకర్యం కల్పించాలని భక్తులు చాలాకాలంగా కోరుతున్నారు. ఈ కొత్త సర్వీసు ప్రారంభంతో వారి చిరకాల కోరిక నెరవేరినట్లయింది. మొత్తం 22 కోచ్‌లతో నడిచే ఈ రైలులో 3 సెకండ్ ఏసీ, 5 థర్డ్ ఏసీ, 10 స్లీపర్ క్లాస్, 4 జనరల్ సెకండ్ క్లాస్ బోగీలు అందుబాటులో ఉన్నాయి.

# ప్రియుడితో సియాకు ముందే పెళ్లి!

**పుణే లోహగడ్ కోట హత్య కేసులో కీలక మలుపు**

పుణే: పుణేలోని లోహగడ్ కోటపై జరిగిన హత్య కేసులో రోజుకో సంచలన విషయం వెలుగులోకి వస్తోంది. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న సియా గోయల్ (20), తన బాయ్‌ఫ్రెండ్ చేతన్ చౌదరిని అప్పటికే రహస్యంగా వివాహం చేసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో కీలక సమాచారం బయటపడింది. పుణేకు చెందిన రియల్టర్ కేతన్ అగర్వాల్‌తో (25) ఆమెకు నిశ్చితార్థం జరిగిన తర్వాత ఈ వివాహం జరగడం గమనార్హం. పోలీసు వర్గాల కథనం ప్రకారం.. సుమారు నాలుగు నెలల క్రితం సియా, చేతన్ ఒక స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రత్యేక వివాహ చట్టం కింద పెళ్లి చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ వివాహానికి సియా కాలేజీ స్నేహితులు ఇద్దరు సాక్షులుగా సంతకాలు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వారిని కూడా విచారించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ రహస్య వివాహాన్ని నిర్ధారించుకునేందుకు పోలీసులు మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం గాలిస్తున్నారు. ఈ జంట పెళ్లి దండలతో ఉన్న కొన్ని ఫొటోలను ఒక ప్రైవేట్ ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి డిలీట్ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ ఫొటోలను తిరిగి పొందేందుకు టెక్నికల్ బృందాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఈ ఫొటోలు దొరికితే కేసులో ఇవి కీలక ఆధారాలుగా మారనున్నాయి. ఈ ఏడాది నవంబర్‌లో కేతన్, సియాల వివాహం ఉదయ్‌పూర్‌లో జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో డెస్టినేషన్ వెడ్డింగ్ కోసం కేతన్ కుటుంబ సభ్యులు సియా డాక్యుమెంట్లు అడగడంతో రహస్య వివాహ విషయం బయటపడుతుందనే భయంతోనే హత్యకు ప్లాన్ వేగవంతం చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. తప్పనిసరి పబ్లిక్ నోటీసును తప్పించుకుని, రహస్య వివాహాన్ని త్వరగా పూర్తి చేయడానికి చేతన్ ఏమైనా మధ్యవర్తికి డబ్బులు చెల్లించాడా? అనే కోణంలో అతని బ్యాంక్ ఖాతాలను కూడా పోలీసులు పరిశీలిస్తున్నారు. కేతన్ అగర్వాల్‌తో పెళ్లి ఇష్టం లేని సియా, జూన్ 18న అతడిని లోహగడ్ కోటకు తీసుకెళ్లి బాయ్‌ఫ్రెండ్‌తో కలిసి హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటోంది.


**మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!**

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## జ్ఞానేశ్వరిని కిడ్నాప్ చేస్తే అప్పగించండి

**డీఎస్పీ తిలక్ కీలక విజ్ఞప్తి**

కాకినాడ, జూలై 7 (ఈవార్తలు): ఏపీలోని తూర్పు గోదావరి జిల్లాలో నెల రోజులకు పైగా అదృశ్యమైన రెండేళ్ల చిన్నారి జ్ఞానేశ్వరి కేసులో పోలీసులు కీలక ప్రకటన చేశారు. పాప ఎవరి వద్దనైనా ఉంటే, ఎలాంటి భయం లేకుండా క్షేమంగా తమకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. అలా అప్పగించిన వారిపై చట్టపరంగా ఎటువంటి చర్యలు తీసుకోబోమని తుని డీఎస్పీ తిలక్ హామీ ఇచ్చారు. తుని మండలం సీహెచ్ అగ్రహారంలోని పామాయిల్ తోటలో కాపలాగా పనిచేస్తున్న సుంకర గణేశ్, భవాని దంపతుల కుమార్తె జ్ఞానేశ్వరి, జూన్ 6న అదృశ్యమైన విషయం తెలిసిందే. తల్లి వంట చేస్తున్న సమయంలో ఇంటి బయట ఆడుకుంటున్న పాప కనిపించకుండా పోయింది. కుటుంబానికి చెందిన పెంపుడు కుక్కతో కలిసి కొండ వైపు వెళ్లినట్లు ఓ గ్రామస్థుడు చూసినా, ఆ తర్వాత కుక్క మాత్రమే ఒంటరిగా తిరిగి వచ్చింది. మంగళవారం తునిలో డీఎస్పీ తిలక్ మీడియాతో మాట్లాడుతూ, పాప ఆచూకీయే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు. సమాచారం అందిస్తే తామే స్వయంగా వచ్చి పాపను తీసుకుంటామని తెలిపారు. చుట్టుపక్కల తోటలు, కొండ ప్రాంతాల్లో గాలించినా జంతువుల దాడి ఆనవాళ్లు లభించలేదని, అందుకే కిడ్నాప్ కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. సెల్‌ఫోన్లు వాడని వ్యక్తులపై దృష్టి సారించినట్లు చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఇప్పటికే ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, అటవీ సిబ్బంది, డ్రోన్లు, డాగ్ స్క్వాడ్లతో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. పాప ఆచూకీ తెలిపిన వారికి రూ.1 లక్ష రివార్డు ప్రకటించారు. కేసు దర్యాప్తులో భాగంగా పెంపుడు కుక్కకు జీపీఎస్ ట్రాకర్ అమర్చినా, అది కూడా ఆ తర్వాత మృతి చెందింది. నెల రోజులు గడిచినా పాప ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

## కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సీఐ నాగరాజు విచారణ

**సాయికృష్ణ కేసులో కీలక మలుపు**

విజయవాడ, జూలై 7(ఈవార్తలు): ఏపీ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ (25) కస్టోడియల్ డెత్ ఆరోపణల కేసులో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటూ సస్పెన్షన్‌కు గురైన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఎస్.వి.వి. నాగరాజును జులై 9 నుంచి ఎనిమిది రోజుల పాటు పోలీస్ కస్టడీలో విచారించేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) మంగళవారం న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో సీఐ నాగరాజును కృష్ణలంక పోలీస్ స్టేషన్ లో విచారించనున్నారు. గతంలో విజయవాడలోని దిగువ కోర్టు నాగరాజును రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులోనే విచారించాలని, ఆ ప్రక్రియను ఆడియో-వీడియో రికార్డింగ్ చేయాలని షరతులు విధించింది. అయితే, ఈ నిబంధనల వల్ల సాక్ష్యాధారాల సేకరణతో పాటు క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ వంటి ప్రక్రియలకు ఆటంకం కలుగుతుందని సిట్ హైకోర్టును ఆశ్రయించింది. సిట్ తరఫు వాదనలతో ఏకీభవించిన జస్టిస్ కుంచం మహేశ్వరరావు, దిగువ కోర్టు విధించిన షరతులను సడలిస్తూ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. వివిధ కేసుల విచారణ నిమిత్తం విజయవాడకు చెందిన సాయికృష్ణను పోలీసులు మార్కాపురంలో అదుపులోకి తీసుకున్నప్పటి నుంచి అతను అదృశ్యమయ్యాడు.

దేశాభివృద్ధిని నడిపించే సాధనాల్లో రవాణా వ్యవస్థ ప్రధానమైనది. అనువైన రైల్వే వ్యవస్థ, అధునాతన మెట్రో వంటి ప్రయాణ సౌకర్యాలు అభివృద్ధి గతిని వేగవంతం చేస్తాయి. కొత్త పెట్టుబడులను తీసుకువస్తాయి. ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయి. ప్రజల జీవితాలను సులభతరం చేస్తాయి. ఈ ప్రాముఖ్యతను గుర్తించి కేంద్ర ప్రభుత్వం గత పన్నెండేళ్లుగా దేశంలో రవాణా వ్యవస్థ అభివృద్ధి, ఆధునీకరణకు ప్రాధాన్యతను ఇచ్చింది. దేశంలో రవాణా వ్యవస్థ సరిగ్గా లేని అనేక ప్రాంతాలకు రైల్వే లైన్లు వేసింది. కొత్త నగరాలకు మెట్రో వ్యవస్థను పరిచయం చేసింది. కొత్త విమానాశ్రయాలను నిర్మించింది.





# రైళ్ల పరుగులు..
# గాలి మోటర్ల ఉరుకులు!

## పుష్కరకాలంలో సులభంగా ప్రయాణం.. 26 నగరాలకు విస్తరించిన మెట్రో సేవలు

### రైల్వే వ్యవస్థ ఆధునీకరణకు పెద్దపీట.. సామాన్యులకు అందుబాటులోకి విమానయానం

## 26 నగరాలకు మెట్రో వ్యవస్థ

గత పన్నెండేళ్లలో దేశంలో మెట్రో రైలు వ్యవస్థ వేగంగా విస్తరించింది. 2014కు ముందు దేశంలో నెలకు 0.68 కిలోమీటర్ల చొప్పున మెట్రో విస్తరణ జరిగింది. ప్రస్తుతం నెలకు దాదాపు 6 కిలోమీటర్ల మెట్రో విస్తరణ జరుగుతోంది. గత 12 ఏళ్లలో దేశంలో మెట్రో రైలు వ్యవస్థకు రూ.3.7 లక్షల కోట్లను వెచ్చించారు. 2014లో ఐదు నగరాల్లో మాత్రమే మెట్రో రైలు సేవలు ఉండగా, ప్రస్తుతం 26 నగరాల్లో మెట్రో రైళ్లు నడుస్తున్నాయి. 2013-14లో సగటున రోజుకు 28 లక్షల మంది మెట్రోలో ప్రయాణించేవారు. ఇప్పుడు ఈ సంఖ్య 1.15 కోట్లకు పెరిగింది. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం కింది దేశంలో బీఈఎంఎల్ దాదాపు 2,100 మెట్రో కోచ్‌లను తయారుచేసింది. మెట్రో వ్యవస్థ విస్తరణ వల్ల వేగవంతమైన, సులభమైన, సరసమైన ప్రయాణ సౌకర్యం ప్రజలకు లభించింది.



## ఆధునీకరణ బాటలో రైల్వే వ్యవస్థ

దేశంలో పేదలకు ప్రధాన ప్రయాణ సౌకర్యమైన రైల్వే వ్యవస్థ గత పన్నెండేళ్లలో సమూలంగా మారింది. రైల్వే ఆధునీకరణకు కేంద్రం ప్రాధాన్యతనిస్తోంది. 2014-15లో భారతీయ రైల్వేకు రూ. 32,000 కోట్ల బడ్జెట్ ఉండగా, 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఇది రూ. 2.78 లక్షల కోట్లకు పెంచింది. రైల్వేలకు కేంద్రం ఇస్తున్న ప్రాధాన్యతతో ఇప్పుడు రైలు ప్రయాణం మరింత సురక్షితంగా, వేగంగా, పర్యావరణహితంగా, సౌకర్యవంతంగా మారింది. కవచ్ వ్యవస్థ ద్వారా రైల్వే భద్రత పెరిగింది. గంటకు 130 కిలోమీటర్లకు పైగా వేగానికి అనువైన రైల్వే ట్రాక్ 2014లో 5,036 కిలోమీటర్లు ఉండగా, 2026కి 23,713 కిలోమీటర్లకు పెరిగింది. వందేభారత్, అమృత్ భారత్ వంటి ఆధునాతన రైళ్లను కేంద్రం తీసుకువచ్చింది. 208 రైల్వే స్టేషన్లను ఆధునీకరించింది. దీంతో పాటు రైలు ప్రయాణికుల సంఖ్య కూడా పెరిగింది. ప్రస్తుతం దేశంలో ప్రతిరోజూ దాదాపు రెండు కోట్ల మంది రైళ్లలో ప్రయాణిస్తున్నారు.

## సామాన్యులకు అందుబాటులోకి విమానయానం

విమాన ప్రయాణం గతంలో కొత్త ప్రాంతాలకు, ధనికులకు మాత్రమే పరిమితమయ్యేది. ఇప్పుడు ఈ పరిస్థితి మారి సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. 2014లో దేశంలో 74 విమానాశ్రయాలు ఉండగా, ఇప్పుడు 165 ఉన్నాయి. అనేక నగరాల్లో కొత్త విమానాశ్రయాల నిర్మాణం చేపట్టడంతో ప్రాంతీయ కనెక్టివిటీ పెరిగింది. విమాన ప్రయాణ ధరలు కూడా తగ్గి సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయి. ఈ పన్నెండేళ్లలో ఎయిర్‌పోర్టులపై రూ. 1.4 లక్షల కోట్ల పెట్టుబడి పెట్టడంతో ఇప్పుడు మన విమానాశ్రయాలు ప్రపంచాన్నే అబ్బురపరుస్తున్నాయి.




# ఫ్రూట్ బ్రెడ్‌లో ఈగ.. చాక్లెట్‌లో దుర్వాసన!

## జగిత్యాల పికప్ పాయింట్ బేకరీపై ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు

**పరిశుభ్రత లోపాల గుర్తింపు.. లేబులింగ్ లేని ఆహార పదార్థాల స్వాధీనం.. నిర్వాహకుడికి నోటీసు**

జగిత్యాల, జూలై 7 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని పికప్ పాయింట్ బేకరీలో విక్రయిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతపై వరుసగా వినియోగదారుల నుంచి ఫిర్యాదులు రావడంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఫ్రూట్ బ్రెడ్‌లో ఈగ కనిపించిందంటూ ఓ వినియోగదారు చేసిన ఫిర్యాదు, వారం రోజుల క్రితం డైరీ మిల్క్ సిల్క్ చాక్లెట్ నుంచి దుర్వాసన వస్తోందంటూ మరో వినియోగదారు చేసిన ఆరోపణల నేపథ్యంలో అధికారులు బేకరీని తనిఖీ చేశారు. ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ అనూష ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో బేకరీలో పరిశుభ్రత ప్రమాణాలు సరిగా పాటించకపోవడం, ఆహార పదార్థాల నిల్వలో లోపాలు ఉన్నట్లు గుర్తించారు. అలాగే లేబులింగ్ లేని కొన్ని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకుని బేకరీ నిర్వాహకుడికి నోటీసు జారీ చేశారు. గుర్తించిన లోపాలను వెంటనే సరిదిద్దాలని, పరిశుభ్రత ప్రమాణాలను ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఇదిలా ఉండగా, వారం రోజుల క్రితం పికప్ పాయింట్‌లో కొనుగోలు చేసిన డైరీ మిల్క్ సిల్క్ చాక్లెట్ నుంచి పాడైపోయినట్లుగా దుర్వాసన వస్తోందని ప్రసాద్ అనే వినియోగదారుడు ఆరోపించారు. ఈ విషయమై బేకరీ యజమానిని ప్రశ్నించగా, "నేనేమైనా ఇంట్లో తయారు చేశానా? కంపెనీ డిస్ట్రిబ్యూటర్ వచ్చినప్పుడు నీకు ఫోన్ చేస్తా.. వచ్చి మాట్లాడుకో" అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని తెలిపారు. అయితే, మంగళవారం ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీల విషయం తెలుసుకున్న అనంతరం ప్రసాద్ మరోసారి బేకరీకి వెళ్లి యజమానిని ప్రశ్నించగా, తాను కొనుగోలు చేసిన చాక్లెట్‌కు సంబంధించిన డబ్బులను తిరిగి చెల్లించారని తెలిపారు. అయితే, వినియోగదారుల ఫిర్యాదులపై తొలుత బాధ్యతాయుతంగా స్పందించకుండా వ్యవహరించడం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. నిర్లక్ష్యం కొనసాగితే ఆహార భద్రత చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారులు హెచ్చరించారు. వినియోగదారులకు నాణ్యమైన, సురక్షితమైన ఆహారాన్ని అందించడం ప్రతి ఆహార వ్యాపారి బాధ్యత అని స్పష్టం చేశారు.



## మహిళా పోలీసుల ఆరోగ్యానికి ప్రత్యేక శ్రద్ధ: ఎస్పీ అశోక్

జగిత్యాల, జూలై 7 (ఈవార్తలు): మహిళా పోలీసు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. ఆరోగ్యవంతమైన మహిళా పోలీసులు కుటుంబంతో పాటు సమాజానికి, పోలీసు శాఖకు మరింత సమర్థవంతంగా సేవలందించగలరని పేర్కొన్నారు. జగిత్యాల పట్టణంలోని ఐఎంఏ హాల్లో మహిళా పోలీసు అధికారులు, సిబ్బందికి సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంతో పాటు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్పీ అశోక్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసు విధులు ఎంతో బాధ్యతాయుతమైనవని, మహిళా సిబ్బంది కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే విధుల్లో అంకితభావంతో పనిచేస్తున్నారని అన్నారు. వారి ఆరోగ్య సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అవగాహన కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సర్వైకల్ క్యాన్సర్ మహిళల్లో ఎక్కువగా కనిపించే వ్యాధుల్లో ఒకటని, సరైన సమయంలో హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా వ్యాధిని నివారించవచ్చని వివరించారు. మహిళలు ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం వైద్య నిపుణులు సర్వైకల్ క్యాన్సర్ లక్షణాలు, నివారణ మార్గాలు, వ్యాక్సిన్ ప్రాముఖ్యత, ఆరోగ్యకరమైన జీవన విధానంపై మహిళా పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించారు. అర్హులైన మహిళా పోలీసులకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందజేశారు. కార్యక్రమంలో డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, ఐఎంఏ ప్రతినిధులు డా. గుడూరి హేమంత్, డా. ఆకుతోట శ్రీనివాస్ రెడ్డి, డా. కోటగిరి సుధీర్ కుమార్, పోలీసు అధికారులు, వైద్య సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.






## కోరుట్లలో గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్ట్

కోరుట్ల, జూలై 7 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలో 60 గ్రాముల గంజాయితో ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో భాగంగా సోమవారం విశ్వసనీయ సమాచారం మేరకు ట్యాంక్‌బండ్ ప్రాంతంలో ఎస్సై చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. పోలీసులను గమనించిన ఇద్దరు వ్యక్తులు పారిపోవడానికి యత్నించగా, వెంటనే అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు. వారి వద్ద మొత్తం 60 గ్రాముల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇందులో మొదటి నిందితుడి వద్ద 40 గ్రాములు, రెండో నిందితుడి వద్ద 20 గ్రాముల గంజాయి లభ్యమైంది. అలాగే రెండు మొబైల్ ఫోన్లు, ఒక హీరో స్ప్లెండర్ ప్లస్ మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో ప్రధాన నిందితుడు మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతానికి చెందిన ఓ గుర్తు తెలియని వ్యక్తి వద్ద నుంచి గంజాయి కొనుగోలు చేసి, వ్యక్తిగత వినియోగంతో పాటు విక్రయాల కోసం తీసుకొచ్చినట్లు తెలిపాడు. అందులో 20 గ్రాములను రెండో నిందితుడికి విక్రయించినట్లు అంగీకరించినట్లు పోలీసులు వెల్లడించారు. నిందితులపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్–100/112కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన పేర్కొన్నారు.



## అభివృద్ధిని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా..?

**కాంగ్రెస్ తీరుపై సుంకె రవిశంకర్ మండిపాటు**

కొడిమ్యాల, జూలై 7 (ఈవార్తలు): చొప్పదండి నియోజకవర్గంలోని కొడిమ్యాల, మల్యాల మండలాల్లో అభివృద్ధిపై ప్రశ్నిస్తున్న ప్రజలపై కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆరోపించారు. మల్యాల మండలం రామకృష్ణాపూర్ గ్రామ ఉపసర్పంచ్ బోనగాని మల్లేశంపై ఇటీవల జరిగిన దాడి నేపథ్యంలో మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా సుంకె రవిశంకర్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులపై ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. అభివృద్ధిపై ప్రశ్నించినందుకు కాంగ్రెస్ నాయకులు దాడులకు దిగడం సరికాదని విమర్శించారు. ఇంటిపైకి వచ్చి దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా, దాడికి గురైన మల్లేశంపైనే కేసు నమోదు చేయడం పోలీసుల పక్షపాత వైఖరికి నిదర్శనమన్నారు. చట్టం అందరికీ సమానంగా అమలు కావాలని, అధికార పార్టీ నాయకులకు మాత్రం చుట్టంలా మారకూడదని అన్నారు. ప్రజలపై దాడులకు పాల్పడే వారికి రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పులి వెంకటేశం, బల్కం మల్లేష్ యాదవ్, పిడుగు ప్రభాకర్ రెడ్డి, సురుగు శ్రీనివాస్, కొత్తూరు స్వామి, రాచకొండ చందు, కోలగాని సత్యం, ఆకునూరు మల్లయ్య, బైరి వెంకటి తదితరులు పాల్గొన్నారు.



## నిధుల దోపిడీకే పీఎంయూ విధానం

**జీవో 17ను రద్దు చేయాలి: మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**

**ప్రభుత్వ కొనుగోళ్లలో పారదర్శకత లేదని ఆరోపణ**

జగిత్యాల, జూలై 7 (ఈవార్తలు): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కలెక్టర్ల నేతృత్వంలోని డీపీసీ విధానాన్ని పక్కన పెట్టి, పీఎంయూ విధానం పేరుతో నిధుల దోపిడీకి తెరలేపిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన వస్తువుల కొనుగోళ్లలో భారీ అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపించారు. పీఎంయూ టెండర్ విధానంలో పెట్టిన నిబంధనలు బడా కంపెనీలకు అనుకూలంగా ఉన్నాయని అన్నారు. ట్రంక్ బాక్స్‌లకు రూ.10 కోట్ల సాల్వెన్సీ, టై–బెల్ట్–బ్యాగ్‌లకు రూ.50 కోట్ల సాల్వెన్సీ, నోట్‌బుక్‌లకు రూ.40 కోట్ల సాల్వెన్సీతో పాటు రూ.150 కోట్ల టర్నోవర్ వంటి నిబంధనలు చిన్న, మధ్యతరహా వ్యాపారులను పోటీ నుంచి దూరం చేస్తున్నాయని పేర్కొన్నారు. టెండర్లలో వస్తువుల ధరలను ముందుగా ప్రకటించకుండా కేవలం నాణ్యతా ప్రమాణాలు మాత్రమే ఇవ్వడం అనుమానాలకు తావిస్తోందన్నారు. 9 రకాల వస్తువులకు 28 ఏజెన్సీలు బిడ్ వేయగా 13 మాత్రమే అర్హత సాధించాయని, వర్క్ ఆర్డర్లు ఎవరికి, ఏ ధరలకు ఇచ్చారో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. రూ.1200 కోట్ల విలువైన వర్క్ ఆర్డర్లలో అధిక భాగం గుజరాత్ కంపెనీలకే వెళ్లాయని, అందులో ఒకే ఏజెన్సీకి రూ.600 కోట్ల మేర కేటాయించారని ఆరోపించారు. చేనేత రంగానికి నష్టం కలిగించేలా జీవో 17 ఉందని, దీనివల్ల రాష్ట్రంలోని 17,069 మంది చేనేత కార్మికులు, 40 వేల కుటుంబాలు, వేలాది చిన్న వ్యాపారులు అవకాశాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అవకాశాలు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం కొనుగోళ్లలో ఎంతమందికి అవకాశం ఇచ్చిందో వెల్లడించాలని కోరారు. దళితుల ఆర్థికాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఎల్ఐడీసీఏపీ సామర్థ్యాలను ఎందుకు వినియోగించలేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. పీఎంయూ టెండర్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని, టెండర్ పత్రాలు, కమిటీ సమావేశాల వివరాలు, ధరల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. మొత్తం ప్రక్రియపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కొప్పుల ఈశ్వర్ కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పద్మశాలి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జాతీయ డాక్టర్స్ డే వేడుకలు

హనుమకొండ, జూలై 7 (ఈవార్తలు): జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యులకు ఆత్మీయ అభినందన కార్యక్రమాన్ని బుధవారం హంటర్ రోడ్డులోని బీసీ నేత హాస్టల్‌లో నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వివిధ ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సేవలందిస్తున్న అల్లోపతి, ఆయుర్వేద, హోమియోపతి, యునాని, నేచురోపతి తదితర విభాగాలకు చెందిన ప్రభుత్వ వైద్యులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి ప్రాంతీయ కంటి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. శ్రీకుమార్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోడం రవిప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో వైద్యులు సమాజానికి అందిస్తున్న విశిష్ట సేవలను వక్తలు ప్రశంసించారు. ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యుల సేవలు అమూల్యమైనవని పేర్కొంటూ, వారి సేవలకు కృతజ్ఞతగా ఈ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.



## ఘనంగా పీఠం ప్రమోద్ జన్మదిన వేడుకలు

హైదరాబాద్, జూలై 7 (ఈవార్తలు): తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల ఫోరం, తెలంగాణ వినియోగదారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ ప్రభుత్వం శ్రమశక్తి అవార్డు గ్రహీత పీఠం ప్రమోద్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్ పోగుల ఆధ్వర్యంలో నాయకులు పీఠం ప్రమోద్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కట్ చేసి వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రైవేట్ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం పీఠం ప్రమోద్ కుమార్ నిరంతరం కృషి చేస్తున్నారని కొనియాడారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఆయన చేస్తున్న సేవలు ఆదర్శప్రాయమని పేర్కొంటూ, ఆయురారోగ్యాలతో మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏవి ప్రమోద్, నాయకులు యుగంధర్, ద్రోణాచార్య, కాశీశ్వరరావు, ప్రసాద్ చౌదరి, శ్రీధర్, రామకృష్ణ, పూర్ణచందర్ తదితరులు పాల్గొని పీఠం ప్రమోద్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.



## యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన

జగిత్యాల, జూలై 7 (ఈవార్తలు): యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లోని కోల్, యాష్ హ్యాండ్లింగ్ విభాగాల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు ప్రభుత్వం టెండర్లు పిలవడాన్ని నిరసిస్తూ జగిత్యాలలో విద్యుత్ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఎన్పీడీసీఎల్ డివిజన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉద్యోగులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించడం వల్ల ఉద్యోగుల హక్కులు, సంస్థల భవిష్యత్తు దెబ్బతింటాయని టీజీపీఈజాక్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. టెండర్ల ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీజీపీఈజాక్ సెక్రటరీ జనరల్ రాంజీ నాయక్, కన్వీనర్ ఆర్ముల్ల ప్రసాద్, డీఈ గంగారాం, నాయకులు సతీష్, రాజమల్లు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## మనం.. అప్పర్ మిడిల్ క్లాస్

భారత్ దిగువ మధ్యస్థాయి ఆదాయ (లోయర్ మిడిల్ క్లాస్) దేశంగానే ఉన్నప్పటికీ తెలంగాణ సహా పలు రాష్ట్రాలు ఎగువ మధ్య ఆదాయ స్థాయి (అప్పర్ మిడిల్ క్లాస్)కి చేరుకున్నట్లు ప్రపంచ బ్యాంకు గణాంకాలు చెబుతున్నాయి. ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక ప్రకారం.. తలసరి ఆదాయంలో తెలంగాణతోపాటు ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు, గుజరాత్ రాష్ట్రాలు అప్పర్ మిడిల్ క్లాస్ స్థాయికి ఎదిగాయి. మరో మూడు రాష్ట్రాలు.. హరియాణా, కేరళ, ఆంధ్రప్రదేశ్ ఈ స్థాయిని అందుకోవడానికి అత్యంత సమీపంలో నిలిచాయి. ప్రపంచ బ్యాంకు ప్రమాణాల ప్రకారం.. వార్షిక తలసరి ఆదాయం రూ.3.88 లక్షలు దాటిన రాష్ట్రాలు ఈ కేటగిరీలోకి వస్తాయి. దేశంలో అత్యధిక తలసరి ఆదాయంతో ఢిల్లీ (రూ.5.90 లక్షలు) మొదటి స్థానంలో ఉండగా, కర్ణాటక (రూ.5.29 లక్షలు), తెలంగాణ (రూ.5.10 లక్షలు), తమిళనాడు (5.05 లక్షలు), గుజరాత్ (రూ.4.49 లక్షలు) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. దేశ సగటు తలసరి ఆదాయం (రూ.2.61 లక్షలు)తో పోలిస్తే ఈ రాష్ట్రాలు ఎంతో ముందంజలో ఉండటం విశేషం. ప్రపంచ బ్యాంకు ఎగువ--మధ్య ఆదాయ పరిమితి రూ.4.40లక్షలుగా ఉంది. కాగా దేశంలోని చాలా రాష్ట్రాల్లో ఇందుకు పూర్తి భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. వివిధ రాష్ట్రాల మధ్య ఆదాయ అసమానతలు తీవ్ర స్థాయిలో పెరుగుతున్నట్లు ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. ప్రపంచబ్యాంక్ 'కంట్రీ ఇన్‌కమ్ క్లాసిఫికేషన్స్--2026' పేరుతో రూపొందించిన నివేదికలో భారత ఆర్థికస్థితిపై ఆసక్తికర అంశాలను వెల్లడించింది.


నేటి ఈవార్తలు

COMMERCIAL RATE CARD

DISPLAY ADVERTISEMENTS
(with effect from 01.04.2026 (Per Sq.cm in Rupees))

| Position | B&W Rate | Colour Rate |
|---|---|---|
| Front Page | Rs.550 | Rs.1,000 |
| Page 3 / Back Page | Rs.350 | Rs.750 |
| Inside Pages | Rs.250 | Rs.500 |

CLASSIFIED LINES & CLASSIFIED DISPLAY:

BLACK & WHITE:
Price for 5 Lines - Rs.450
(for each extra line - Rs.90)

COLOUR:
Price for 5 Lines - Rs.500
(for each extra line - Rs.100)

Phone: +91 94404 55811
Email: contact@evarthalu.com

## వయ్యారి చిత్రం



పాయల్ రాజ్‌పుత్

# విడుదలకు ముందే జైలర్ 2 వీరవిహారం

సినిమా రిలీజ్ కు ఇంకా టైమ్ ఉన్నప్పటికీ, ట్రేడ్ వర్గాల్లో ఇప్పటికే భారీ డిస్కషన్ కు కారణమవుతున్న ప్రాజెక్ట్‌గా జైలర్2 నిలుస్తోంది. మొదటి భాగం సాధించిన కమర్షియల్ సక్సెస్ తో పాటు, సీక్వెల్‌పై ఏర్పడిన అంచనాలు ఇప్పుడు ప్రీ రిలీజ్ బిజినెస్‌ను నెక్ట్స్ లెవెల్ కు తీసుకెళ్తున్నాయనే అభిప్రాయం ఇండస్ట్రీలో వ్యక్తమవుతోంది. రిలీజ్ కు ముందే డిస్ట్రిబ్యూషన్ రైట్స్ కోసం వివిధ ఏరియాల నుంచి ఇంట్రెస్ట్ పెరగడం ఈ సినిమాపై ఉన్న మార్కెట్ నమ్మకాన్ని స్పష్టంగా చూపిస్తోంది. ప్రత్యేకంగా కేరళ మార్కెట్‌లో జైలర్2కు అనూహ్యమైన డిమాండ్ కనిపిస్తోందని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. మొదటి భాగం అక్కడ బెస్ట్ కలెక్షన్లు నమోదు చేయడంతో, జైలర్ రైట్స్ ను సొంతం చేసుకోవడానికి ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు పోటీపడుతున్నట్లు సమాచారం. అడ్వాన్స్ డీల్స్ విషయంలోనూ భారీ ఆఫర్లు వినిపిస్తున్నాయని ప్రచారం జరుగుతోంది. ఇది సినిమా రిలీజ్‌కు ముందే రికార్డు స్థాయి బిజినెస్‌కు సంకేతంగా భావిస్తున్నారు. దీనికి మరో ప్రధాన కారణంగా మల్టీస్టారర్ ఎట్రాక్షన్ ను ట్రేడ్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా మోహన్‌లాల్ ప్రభావం కేరళ మార్కెట్‌లో సినిమాకు మరింత బలాన్ని చేకూరుస్తుందని అంచనా వేస్తున్నారు. ఆయనకు ఉన్న అభిమాన వర్గం, రజినీకాంత్‌కు ఉన్న విశాలమైన మార్కెట్ కలిసి ఈ సినిమాను సౌత్‌లో అత్యంత క్రేజ్ ఉన్న ప్రాజెక్టుల లిస్టులో నిలబెడుతున్నాయి. రీసెంట్ గా రిలీజైన రిలీజ్ డేట్ గ్లింప్స్ కూడా సినిమాపై హైప్‌ను మరింత పెంచింది. సోషల్ మీడియాలో గ్లింప్స్‌కు వచ్చిన రెస్పాన్స్, ఫ్యాన్స్ డిస్కషన్స్, ట్రేడ్ వర్గాల్లో పెరిగిన ఆసక్తి కలిసి జైలర్2పై అంచనాలను మరింత బలపరిచాయి. సినిమా కంటెంట్‌కు సంబంధించిన వివరాలు పూర్తిగా బయటకు రాకముందే ఈ రేంజ్ బజ్ రావడం విశేషం. తెలుగు మార్కెట్‌లోనూ పరిస్థితి ఇదే విధంగా కనిపిస్తోంది. జైలర్ కు లభించిన ఆదరణ కారణంగా రెండో భాగం థియేట్రికల్ రైట్స్ పై కూడా మంచి ఆసక్తి నెలకొనే అవకాశాలున్నాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ మార్కెట్లలో ఒకేసారి స్ట్రాంగ్ బిజినెస్‌ను టార్గెట్ గా పెట్టుకుని రిలీజ్ ప్లాన్స్ రూపొందుతున్నాయనే చర్చ సాగుతోంది.






# నేను తిరుమలకు వస్తే భక్తులకు ఇబ్బంది

తెలుగు సినీ ప్రేక్షకులను తనదైన కామెడీతో ఎన్నో సంవత్సరాల పాటూ అలరించిన సీనియర్ నటుడు బాబు మోహన్ తాజాగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. చాలా కాలం తర్వాత శ్రీవారి సన్నిధికి వచ్చిన ఆయన, ఇంతకాలం తిరుమలకు ఎందుకు రాలేదనే విషయాన్ని స్వయంగా వెల్లడించారు. తన రాకతో ఇతర భక్తులకు అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతోనే గత ఐదారు సంవత్సరాలుగా తిరుమలకు దూరంగా ఉన్నానని ఆయన చెప్పారు. మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో శ్రీవేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్న బాబు మోహన్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. దర్శనం అనంతరం ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, రెండు నెలల క్రితమే ఎట్టి పరిస్థితుల్లోనైనా స్వామివారిని దర్శించుకోవాలని నిర్ణయించుకున్నానని తెలిపారు. ఇటీవల తిరుపతి పరిసర ప్రాంతాల్లో సినిమా షూటింగ్ ఉండటంతో ఈ అవకాశాన్ని వినియోగించుకుని శ్రీవారిని దర్శించుకున్నానని చెప్పారు. తనకు అభిమానుల నుంచి లభించే ఆదరణ కారణంగా ఆలయంలో రద్దీ పెరిగి ఇతర భక్తులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉండేదని భావించానని బాబు మోహన్ పేర్కొన్నారు. అందుకే చాలాకాలం పాటు తిరుమలకు రాకుండా ఉండిపోయానని తెలిపారు. అయితే ఈసారి షూటింగ్ పనులు పూర్తైన తర్వాత స్వామివారి దర్శనం చేసుకోవడం తనకు ఎంతో ఆనందంగా అనిపించిందన్నారు. సినీ కెరీర్ గురించి కూడా ఆయన ఆసక్తికర విషయాలు వెల్లడించారు.

# జోరు పెంచిన వెంకీ-కల్యాణ్‌రామ్

టాలీవుడ్‌లో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న మల్టీస్టారర్ చిత్రాల్లో దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న కొత్త సినిమా ఒకటి. విక్టరీ వెంకటేశ్, నందమూరి కల్యాణ్ రామ్ తొలిసారి కలిసి నటిస్తున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్, మాస్ ఎలిమెంట్స్‌తో రూపొందుతున్న ఈ సినిమాపై ఇప్పటికే సినీ అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల కల్యాణ్ రామ్‌పై ప్రత్యేక గీతాన్ని చిత్రీకరించిన చిత్రబృందం, ఇప్పుడు తదుపరి కీలక షెడ్యూల్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించింది. ఈ షెడ్యూల్‌లో విక్టరీ వెంకటేశ్ కూడా సెట్స్‌లోకి అడుగుపెట్టడంతో షూటింగ్ మరింత జోరందుకుంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌లో సినిమా చిత్రీకరణ జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో వెంకటేశ్, కల్యాణ్ రామ్‌తో పాటు హీరోయిన్లు కీర్తి సురేష్, కృతి శెట్టి పాల్గొంటున్నారు.




# కంగనా క్వీన్2కు కష్టాలు



బాలీవుడ్ నటి కంగనా రనౌత్ కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన చిత్రాల్లో 'క్వీన్' ఒకటి. 2014లో విడుదలైన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలతో పాటు భారీ విజయాన్ని కూడా అందుకుంది. ఇప్పుడు దాదాపు పదేళ్ల తర్వాత ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'క్వీన్ 2' తెరకెక్కుతోంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. అయితే విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమాకు ఇప్పుడు ఊహించని లీగల్ సమస్య ఎదురైంది. క్వీన్ 2పై రూ.250 కోట్ల న్యాయపరమైన వివాదం నెలకొనడం బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తాజా నివేదికల ప్రకారం, ఫాంటమ్ స్టూడియోస్ ముంబై హైకోర్టులో జియోస్టార్‌పై రూ.250 కోట్ల దావా వేసింది. తమ అనుమతి లేకుండానే క్వీన్ 2 ను రూపొందించారని, ఇది అసలు సినిమా మేధో సంపత్తి హక్కులను ఉల్లంఘించడమేనని సంస్థ ఆరోపిస్తోంది. ఫాంటమ్ స్టూడియోస్ వాదన ప్రకారం, 'క్వీన్' చిత్రానికి సంబంధించిన మేధో సంపత్తి హక్కుల్లో తమకు 50 శాతం వాటా ఉందని, సీక్వెల్‌లు లేదా అనుబంధ చిత్రాలు నిర్మించాలంటే తమ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. 'క్వీన్ 2' నిర్మాణానికి సంబంధించి తమను ఎవరూ సంప్రదించలేదని, సీక్వెల్ నిర్మాణానికి తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఫాంటమ్ స్టూడియోస్ కోర్టుకు తెలిపినట్లు సమాచారం. ఈ కారణంగానే ఈ సినిమా తమ హక్కులను ఉల్లంఘిస్తోందని సంస్థ ఆరోపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఫాంటమ్ స్టూడియోస్ ఈ వివాదంపై బహిరంగ ప్రకటన విడుదల చేసింది. అలాగే జియోస్టార్, దర్శకుడు వికాస్ బహల్‌తో పలుమార్లు చర్చలు జరిపి సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. అయితే ఆ చర్చలు ఫలించకపోవడంతో పాటు, 'క్వీన్ 2' షూటింగ్ పూర్తయిందని తెలిసిన తర్వాత సంస్థ కోర్టును ఆశ్రయించినట్లు బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి.

# నా కొడుకు గర్వపడేలా చేస్తా: కాజల్ అగర్వాల్

స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ పెళ్లి, మాతృత్వం తర్వాత కూడా తన సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు. దశాబ్దానికి పైగా తెలుగు, తమిళం, హిందీ భాషల్లో అగ్ర కథానాయికగా రాణించిన ఆమె ప్రస్తుతం వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. అయితే తల్లి అయిన తర్వాత తన ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయిందని, ఇప్పుడు సినిమాల ఎంపికలో కొత్త ప్రమాణాలను పాటిస్తున్నానని కాజల్ తాజాగా వెల్లడించారు. ప్రస్తుతం ది ఇండియా స్టోరీ తో పాటు ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం 'రామాయణ' షూటింగ్‌లతో బిజీగా ఉన్న కాజల్, ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం, కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. తల్లి అయిన తర్వాత సినిమాలకు ఓకే చెప్పే విధానం పూర్తిగా మారిపోయిందని కాజల్ తెలిపారు. ఇప్పుడు ఏ కథ వినినా ముందు ఒక నటిగా కాకుండా తల్లిగా ఆలోచిస్తాను. నా కొడుకు నీల్ పెద్దయ్యాక నా సినిమాలు చూసి, 'ఇది మా అమ్మ చేసిన గొప్ప సినిమా' అని గర్వంగా చెప్పుకునేలా ఉండాలి. అందుకే ఇప్పుడు స్క్రిప్ట్ ఎంపికలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాను అని చెప్పారు.



# నా అందాలు ఫ్రీజ్ చేశా

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ తాజాగా తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయాన్ని అభిమానులతో పంచుకున్నారు. మహిళల ఆరోగ్యం, మాతృత్వం గురించి అవగాహన పెంచేలా ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఓ పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న కృతి.. 'మిమి' సినిమా షూటింగ్ సమయంలో తన అండాలను భద్రపరిచినట్లు తొలిసారిగా వెల్లడించారు. ఈ విషయాన్ని నేను ఇప్పటివరకు ఎక్కడా చెప్పలేదు. 'మిమి' సినిమా చేస్తున్న సమయంలోనే నా అండాలను ఫ్రీజ్ చేయించుకున్నాను. ఆ సినిమా కోసం బరువు పెరగాల్సి వచ్చింది. అందుకు ప్రత్యేక ఆహారం తీసుకోవాల్సి వచ్చేది. దాంతో శరీరంలో చాలా మార్పులు వచ్చాయి. కడుపు ఉబ్బరంగా ఉండేది. అయినా పాత్ర కోసం అవసరమైన మార్పులన్నీ అంగీకరించాను అని తెలిపారు. ఆ సమయంలో షూటింగ్‌లో ఉన్న ఓ వ్యక్తి ఇచ్చిన సలహానే తన నిర్ణయానికి కారణమైందని కృతి చెప్పారు. ఎవరో ఒకరు నాకు.. 'ఈ పని చేయగలిగితే నీకు నువ్వు ఇచ్చుకునే అత్యుత్తమ బహుమతి ఇదే' అని చెప్పారు. ఆ మాట నా మనసులో బలంగా నాటుకుపోయింది. అప్పటికే సినిమా కోసం శారీరకంగా చాలా మార్పులు చేసుకుంటున్నాను కాబట్టి, ఇదే సరైన సమయం అనిపించింది. అందుకే అండాలను ఫ్రీజ్ చేయించుకోవాలని నిర్ణయించుకున్నాను అని వెల్లడించారు. 'మిమి' సినిమాలో కృతి సనన్ సరోగసీకి అంగీకరించే యువతి పాత్రలో నటించారు. ఆ పాత్ర కోసం ఆమె శరీర బరువును పెంచుకోవడంతో పాటు గర్భిణిలా కనిపించేలా ప్రత్యేకంగా సిద్ధమయ్యారు. పాత్రకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఆమె తీసుకున్న కృషికి ప్రేక్షకుల నుంచి విశేష ప్రశంసలు లభించాయి. అదే సినిమాకు గాను కృతి జాతీయ ఉత్తమ నటి అవార్డును కూడా అందుకున్నారు.






# రొనాల్డో కలలు సమాధి

## కన్నీటిపర్యంతమైన ఫుట్‌బాల్ దిగ్గజం

ఫుట్‌బాల్ దిగ్గజం, పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో వరల్డ్ కప్ కల విషాదాంతమైంది. కెరీర్‌లో ఇదే తన చివరి ప్రపంచకప్ అని ప్రకటించిన 24 గంటల వ్యవధిలోనే అతనికి తీరని శోకం మిగిలింది. కెరీర్‌లో లోటుగా ఉన్న ప్రపంచకప్‌ను ముద్దాడకుండానే అతని అద్భుత ప్రయాణం ముగిసింది.



ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీలో భాగంగా డల్లాస్ స్టేడియం వేదికగా జరిగిన హై-వోల్టేజ్ ప్రిక్వార్టర్స్ పోరులో స్పెయిన్ 1-0తో పోర్చుగల్‌ను మట్టికరిపించింది. ఈ ఓటమితో పోర్చుగల్ టోర్నీ నుంచి నిష్క్రమించగా.. రొనాల్డో కన్నీరు మున్నీరు అవుతూ ఆటకు వీడ్కోలు పలికాడు. ఐదుసార్లు బాలన్ డి ఓర్ విజేత అయిన 41 ఏళ్ల క్రిస్టియానో రొనాల్డో.. ఇప్పటి వరకు 25 ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడాడు. అర్జెంటీనా స్టార్ లియోనెల్ మెస్సీ(27) తర్వాత అత్యధిక ప్రపంచకప్ మ్యాచ్‌లు ఆడిన ఆటగాడిగా రొనాల్డో నిలిచాడు. ఈ 25 మ్యాచ్‌ల్లో రొనాల్డో 11 గోల్స్ నమోదు చేయడంతో పాటు 2 గోల్స్‌కు అసిస్ట్ చేశాడు. కెరీర్‌లో తీరని లోటుగా ఉన్న ప్రపంచకప్‌ను గెలవాలనే కసితో 41 ఏళ్ల వయసులో బరిలోకి దిగిన రొనాల్డోకు స్పెయిన్ దిమ్మతిరిగే షాకిచ్చింది. సబ్‌స్టిట్యూట్ ప్లేయర్ మైకెల్ మెరినో ఆట చివర్లో (91వ నిమిషంలో) గోల్ నమోదు చేసి స్పెయిన్‌కు చిరస్మరణీయమైన విజయాన్ని అందించాడు. మ్యాచ్ ఆసాంతం ఇరు జట్లు నువ్వా-నేనా అన్నట్లు హోరాహోరీగా తలపడ్డాయి. దాంతో ఫస్టాఫ్‌లో ఇరు జట్లకు గోల్ రాలేదు. సెకండాఫ్‌లో కూడా ఇరు జట్లు పోరాడాయి. మ్యాచ్ అదనపు సమయానికి దారితీస్తుందనుకున్న తరుణంలో.. 85వ నిమిషంలో డానీ ఓల్మో స్థానంలో మైకెల్ మెరినో సబ్‌స్టిట్యూట్‌గా మైదానంలోకి వచ్చాడు. సరిగ్గా 91వ నిమిషంలో ఫెర్రాన్ టోరెస్ అందించిన అద్భుతమైన పాస్‌ను మెరినో ఎలాంటి తప్పు చేయకుండా పోర్చుగల్ గోల్‌కీపర్ డియోగో కోస్టాను బోల్తా కొట్టిస్తూ గోల్‌గా మలిచాడు. ఈ ఒక్క గోల్‌తో స్పెయిన్ శిబిరంలో సంబరాలు మిన్నంటాయి. 1962లో మెక్సికోపై పెయిరో తర్వాత, ప్రపంచకప్‌లో స్పెయిన్ తరఫున 90వ నిమిషంలో వచ్చిన రెండో లేట్ విన్నర్ గోల్ ఇదే కావడం విశేషం. పోర్చుగల్ జట్టుకు లభించిన అవకాశాలను స్పెయిన్ గోల్‌కీపర్ ఉనై సిమోన్ అద్భుతంగా అడ్డుకున్నాడు. గోల్ పోస్ట్‌కు అడ్డుగోడలా నిలబడ్డాడు. రొనాల్డో కొట్టిన వాలీని సిమోన్ అద్భుతంగా ఆపగా.. నునో మెండిస్ కొట్టిన షాట్ క్రాస్‌బార్‌కు తగిలి వెనుదిరిగింది. మ్యాచ్ సెకండాఫ్‌లో పోర్చుగల్ అటాకింగ్ పూర్తిగా విఫలమైంది. స్పెయిన్ డిఫెన్స్ విభాగాన్ని ఛేదించడంలో వారు తడబడ్డారు. పోర్చుగల్ ఎక్స్‌పెక్టెడ్ గోల్స్ రేషియో కేవలం 0.6 కాగా.. స్పెయిన్ 1.77 తో ఆధిపత్యం ప్రదర్శించింది. ఈ విజయంతో స్పెయిన్ ప్రపంచకప్ చరిత్రలోనే వరుసగా 6 మ్యాచ్‌ల్లో క్లీన్ షీట్ (గోల్ ఇవ్వకుండా) నమోదు చేసిన తొలి జట్టుగా చరిత్ర సృష్టించింది. క్వార్టర్ ఫైనల్లో స్పెయిన్ బెల్జియంతో తలపడనుంది.



# అమెరికా అవుట్!

## చిత్తుగా ఓడించిన బెల్జియం





ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీలో ఆతిథ్య అమెరికా పోరాటం ముగిసింది. అద్వితీయమైన ప్రదర్శనతో అగ్రరాజ్యం ప్రపంచకప్ కలలను బెల్జియం చిదిమేసింది. మంగళవారం తెల్లవారు జామున సీటెల్ స్టేడియంలో జరిగిన ప్రీక్వార్టర్ పోరులో బెల్జియం 4-1 తేడాతో అమెరికాను చిత్తు చేసింది. బెల్జియం స్టార్ చార్లెస్ డి కెటెలెరే డబుల్ గోల్స్‌తో పాటు ఒక అసిస్ట్‌తో చెలరేగి అమెరికా పతనాన్ని శాసించాడు.

ఈ విజయంతో బెల్జియం క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లగా.. అమెరికా ఇంటిబాట పట్టింది. మ్యాచ్ మొదలైన 46 సెకన్లలోనే బెల్జియం అటాకింగ్ విరుచుకుపడింది. 9వ నిమిషంలోనే నికోలస్ రాస్కిన్ అందించిన లో-క్రాస్‌ను డి కెటెలెరే గోల్‌గా మలిచి బెల్జియంకు 1-0తో ఆధిక్యాన్ని అందించాడు. అయితే 30వ నిమిషంలో అమెరికా ప్లేయర్ మాలిక్ టిల్‌మన్ ఫ్రీ-కిక్ కొట్టగా.. అది బెల్జియం డిఫెండర్లకు తగిలి గోల్‌గా మారింది.

దాంతో స్కోరు 1-1 తో సమమై అమెరికా అభిమానుల్లో ఆశలు చిగురించాయి. కానీ ఆ సంతోషం రెండు నిమిషాలు కూడా నిలవలేదు. 32వ నిమిషంలో ట్రోసార్డ్ అందించిన క్రాస్‌ను డి కెటెలెరే హెడర్ ద్వారా మళ్లీ గోల్ చేసి బెల్జియం ఆధిక్యాన్ని 2-1తో డబుల్ చేశాడు. సెకండాఫ్‌లో అమెరికా గోల్‌కీపర్ మాట్ ఫ్రీజ్ చేసిన ఘోర తప్పిదం మ్యాచ్‌ను పూర్తిగా బెల్జియం వైపు తిప్పేసింది. కీపర్ ఫ్రీజ్ నుంచి బంతిని లాక్కున్న డి కెటెలెరే, దానిని హన్స్ వనాకెన్‌కు అందించాడు. ఖాళీ పోస్ట్‌ను చూసి వనాకెన్ దూరం నుంచి సులువుగా గోల్ చేయడంతో బెల్జియం 3-1 తో ముందంజ వేసింది. చివరి నిమిషాల్లో అమెరికా ఆటగాళ్లు బాలోగన్, బెర్హాల్టర్ సులువైన అవకాశాలను వృధా చేశారు. ఇంజూరీ టైమ్‌లో సబ్‌స్టిట్యూట్ ప్లేయర్ రొమేలు లుకాకు మరో క్లినికల్ గోల్ కొట్టడంతో అమెరికా 4-1 తో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. క్వార్టర్ ఫైనల్లో స్పెయిన్‌తో బెల్జియం తలపడనుంది. ప్రపంచకప్ చరిత్రలో ఒకే మ్యాచ్‌లో 3 గోల్స్‌లో (2 గోల్స్, 1 అసిస్ట్) నేరుగా భాగస్వామ్యం పంచుకున్న తొలి బెల్జియం ఆటగాడిగా చార్లెస్ డి కెటెలెరే రికార్డు సృష్టించాడు. అమెరికా జట్టు ప్రపంచకప్‌లో ప్రిక్వార్టర్స్‌కు చేరడం ఇది ఏడోసారి కాగా.. అందులో 6 సార్లు (2010, 2014, 2022, 2026 లతో కలిపి వరుసగా 4 సార్లు) ప్రిక్వార్టర్స్‌లోనే వెనుదిరిగింది. బెల్జియం ఈ మ్యాచ్‌లో 2.15 ఎక్స్‌పెక్టెడ్ గోల్స్ నమోదు చేయగా.. అమెరికా కేవలం 0.67 తో చేతులెత్తేసింది.



# నా పేరుతో ఫేక్ స్టేట్‌మెంట్

భారత టీ20 మాజీ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, తన పేరుతో సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ ఫేక్ స్టేట్‌మెంట్‌పై స్పందించాడు. ఆ వ్యాఖ్యలు తాను చేయలేదని, అలాంటి అసత్య ప్రచారాలను నమ్మవద్దని అభిమానులకు, నెటిజన్లకు విజ్ఞప్తి చేశాడు. ఈ మేరకు తన 'ఎక్స్' ఖాతా ద్వారా ఒక ప్రకటన విడుదల చేశాడు. టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత సూర్యకుమార్‌ను కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పించి, అతని స్థానంలో శ్రేయస్ అయ్యర్‌ను నియమించిన సంగతి తెలిసిందే. అంతేగాక ఇంగ్లండ్ పర్యటన, ఆసియన్ గేమ్స్ జట్లలో కూడా అతనికి చోటు దక్కలేదు. ఈ నేపథ్యంలో తనకు సరైన గౌరవం ఇవ్వలేదని, భవిష్యత్తుపై బీసీసీఐ నుంచి ఎలాంటి స్పష్టత రాలేదని సూర్యకుమార్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లుగా ఓ తప్పుడు ప్రకటన సోషల్ మీడియాలో ప్రచారంలోకి వచ్చింది. ఈ వివాదంపై సూర్యకుమార్ స్పందిస్తూ.. "నా పేరుతో ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతున్న ఒక స్టేట్‌మెంట్‌ను నేను గమనించాను. నేను అలాంటి వ్యాఖ్యలు చేయలేదని, వాటికి ఎలాంటి అధికారం ఇవ్వలేదని స్పష్టం చేయాలనుకుంటున్నాను. దయచేసి ధ్రువీకరించని సమాచారాన్ని నమ్మవద్దు, షేర్ చేయవద్దు" అని తన పోస్ట్‌లో పేర్కొన్నాడు. ఈ వివాదానికి ముగింపు పలకాలని భావిస్తూ, టీమిండియాకు తన పూర్తి మద్దతును ప్రకటించాడు. "జట్టు విజయం పట్ల నేను చాలా సంతోషంగా ఉన్నాను. వారికి ఎల్లప్పుడూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. మన కుర్రాళ్లు అత్యుత్తమ ప్రదర్శన ఇస్తున్నారని నాకు తెలుసు. వారికి నా పూర్తి మద్దతు ఎప్పుడూ ఉంటుంది. నాపై తప్పుడు ఆరోపణల కంటే భారత క్రికెట్, నా సహచరులు, ఆటకు నేను ఇచ్చే మద్దతే బలంగా మాట్లాడుతుంది" అని సూర్యకుమార్ వివరించాడు. ఇదే సందర్భంగా 15 ఏళ్ల 99 రోజుల వయసులో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసి చరిత్ర సృష్టించిన యువ కెరటం వైభవ్ సూర్యవంశీపై సూర్యకుమార్ ప్రత్యేక ప్రశంసలు కురిపించాడు. "వైభవ్, నువ్వు ఒక అద్భుతమైన ప్రయాణం ప్రారంభంలో ఉన్నావు.

# ఆఫ్ఘన్ క్రికెటర్ షాపూర్ జద్రాన్ మృతి

ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దేశ మాజీ ఫాస్ట్ బౌలర్ షాపూర్ జద్రాన్ (38) కన్నుమూశాడు. గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న జద్రాన్, ఢిల్లీలో చికిత్స పొందుతూ నేడు తుదిశ్వాస విడిచాడు. రేపు తన 39వ పుట్టినరోజు జరుపుకోవాల్సి ఉండగా, ఒక్కరోజు ముందే అతడు ఈ లోకాన్ని వీడటం ఆఫ్ఘన్ క్రికెట్ సమాజాన్ని శోకసంద్రంలో ముంచింది. ఈ విషయాన్ని ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) అధికారికంగా ధ్రువీకరించింది. షాపూర్ జద్రాన్, స్టేజ్ ఫోర్ హెమోఫాగోసిటిక్ లింఫోహిస్టియోసైటోసిస్ (హెచ్‌ఎల్‌హెచ్) అనే అరుదైన, ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ వ్యాధి శరీరంలో తీవ్రమైన ఇన్‌ఫ్లమేషన్‌కు కారణమవుతుంది, దీనివల్ల ఎముకల మజ్జ, కాలేయం, ప్లీహం వంటి కీలక అవయవాలు దెబ్బతింటాయి. గతేడాది అక్టోబర్‌లో అతని ఆరోగ్యం క్షీణించడంతో మెరుగైన చికిత్స కోసం భారత్‌కు వెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో ఆఫ్ఘన్ స్టార్ క్రికెటర్ రషీద్ ఖాన్, ఏసీబీ ఛైర్మన్ మీర్వైస్ అష్రఫ్ ప్రత్యేక చొరవ తీసుకుని అతని వీసా ప్రక్రియను వేగవంతం చేశారు. ఈ ఏడాది జనవరి 18న జద్రాన్ న్యూఢిల్లీలోని ఓ ఆసుపత్రిలో చేరాడు. అప్పటి నుంచి అతనికి చికిత్స కొనసాగుతోంది. మే నెల నుంచి ఐసీయూలోనే ఉన్నాడు. జద్రాన్ చికిత్స సమయంలో ఆఫ్ఘన్ క్రికెట్ సమాజం జద్రాన్ కు అండగా నిలిచింది. మాజీ కెప్టెన్ అస్గర్ అఫ్ఘన్, దుబాయ్ నుంచి ఢిల్లీకి పలుమార్లు ప్రయాణించి జద్రాన్‌కు ధైర్యం చెప్పాడు. రషీద్ ఖాన్‌తో పాటు పలువురు ఆఫ్ఘన్ క్రికెటర్లు ఎప్పటికప్పుడు అతని కుటుంబ సభ్యులు, వైద్యులతో మాట్లాడుతూ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. చికిత్స ప్రారంభంలో అతని ఆరోగ్యం కాస్త మెరుగుపడినప్పటికీ, తరచూ ఇన్‌ఫెక్షన్లు సోకడం, డెంగ్యూ, రక్తంలో ఎర్ర రక్త కణాల సంఖ్య గణనీయంగా పడిపోవడంతో పరిస్థితి మళ్లీ విషమించి, చివరికి మరణానికి దారితీసింది.

### ఏసీబీ తీవ్ర దిగ్భ్రాంతి

షాపూర్ జద్రాన్ మృతిపై ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. "ఆఫ్ఘన్ క్రికెట్‌కు షాపూర్ గౌరవం, ధైర్యంతో గర్వించేలా సేవలందించాడు. అతను అందించిన సేవలు, సాధించిన విజయాలు ఆఫ్ఘన్ క్రికెట్ చరిత్రలో ఎప్పటికీ నిలిచిపోతాయి. మైదానం బయట కూడా షాపూర్ ఎంతో మంది యువ క్రికెటర్లకు స్ఫూర్తిగా నిలిచాడు. అతడి పోరాట స్ఫూర్తి, పట్టుదల, ఆటపై ఉన్న ప్రేమ ఎందరికో ఆశను ఇచ్చాయి. ఆఫ్ఘన్ క్రికెట్ భవిష్యత్తుపై నమ్మకం కలిగించి, పెద్ద కలలు కనేలా ఒక తరాన్ని ప్రోత్సహించాయి" అని ఏసీబీ తమ ప్రకటనలో పేర్కొంది.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# ప్రజల మనిషి... అభివృద్ధి మార్గదర్శి

ఒక నాయకుడి గొప్పతనాన్ని ఆయన పదవులు నిర్ణయించవు. ప్రజల జీవితాల్లో తీసుకొచ్చిన మార్పు, పాలనలో చూపిన దూరదృష్టి, సంక్షేమం పట్ల ఉన్న నిబద్ధతే ఆయన స్థానాన్ని చరిత్రలో నిలబెడతాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అలాంటి నాయకుల్లో ఒకరు. రైతు, పేద, విద్యార్థి, రోగి, మహిళ..సమాజంలోని ప్రతి వర్గం కోసం ఆలోచించిన నాయకుడిగా ఆయన ఇప్పటికీ కోట్లాది ప్రజల హృదయాల్లో నిలిచిపోయారు. ఆయన జయంతి సందర్భంగా అందించే నివాళి కేవలం ఒక నాయకుడికి గౌరవం మాత్రమే కాదు; ప్రజాకేంద్రిత పాలనకు ఇచ్చే గౌరవం కూడా. వైద్య వృత్తి నుంచి ప్రజా జీవితంలోకి అడుగుపెట్టిన వైఎస్, ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునే నాయకుడిగా ఎదిగారు. ఆయన చేపట్టిన పాదయాత్ర రాష్ట్ర రాజకీయ చరిత్రలో ఒక మలుపుగా నిలిచింది. గ్రామీణ ప్రాంతాల్లో రైతుల ఇబ్బందులు, కరవు, తాగునీటి సమస్యలు, సాగునీటి కొరత, నిరుద్యోగం, ఆరోగ్య సేవల లోపాలు వంటి అంశాలను దగ్గరగా పరిశీలించిన ఆయన, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి పరిష్కారానికే ప్రాధాన్యం ఇచ్చారు. ప్రజల మధ్య నడిచి వారి మనసును గెలుచుకున్న నాయకుడిగా ఆయనకు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి గురించి మాట్లాడినప్పుడు ముందుగా గుర్తుకు వచ్చేది జలయజ్ఞం. సాగునీటి సామర్థ్యాన్ని పెంచడం, ఎండబారిన ప్రాంతాలకు నీటిని అందించడం, వ్యవసాయాన్ని బలోపేతం చేయడం లక్ష్యంగా అనేక భారీ, మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టులను ప్రారంభించారు. అన్ని ప్రాజెక్టులు ఒకే సమయంలో పూర్తికాలేకపోయినా, నీటివనరుల అభివృద్ధిని ప్రభుత్వ ప్రాధాన్య అంశంగా మార్చిన నాయకుడిగా ఆయన పేరు నిలిచిపోయింది. సాగునీరు అందితే రైతు బతుకుతాడు, రైతు బతికితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందనే ఆయన నమ్మకం పాలనలో స్పష్టంగా కనిపించింది. రైతు సంక్షేమం విషయంలో వైఎస్ ప్రభుత్వం తీసుకున్న చర్యలు విశేష ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రైతులకు ఉచిత విద్యుత్ అందించడం, వ్యవసాయానికి అనుకూల విధానాలను అమలు చేయడం, గ్రామీణాభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం వంటి నిర్ణయాలు వ్యవసాయ రంగానికి ఊతమిచ్చాయి. వ్యవసాయాన్ని కేవలం వృత్తిగా కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఆయన భావించారు. ఆరోగ్య రంగంలో ఆయన ప్రారంభించిన ఆరోగ్యశ్రీ పథకం దేశవ్యాప్తంగా ఒక ఆదర్శంగా నిలిచింది. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఖరీదైన వైద్య చికిత్స అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రారంభమైన ఈ పథకం అనేక మంది ప్రాణాలను కాపాడింది. పేదరికం కారణంగా వైద్యం అందకుండా ఉండకూడదనే భావనతో రూపొందించిన ఈ కార్యక్రమం తర్వాత అనేక రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలిచింది. ఆరోగ్య సేవలు సంపన్నులకు మాత్రమే కాకుండా సాధారణ ప్రజలకు కూడా అందుబాటులో ఉండాలనే ఆలోచనను కార్యరూపంలోకి తీసుకువచ్చిన నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారు. విద్యా రంగంలో కూడా ఆయన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ప్రభావవంతంగా నిలిచాయి. ఉన్నత విద్యను పేద విద్యార్థులకు చేరువ చేయాలనే లక్ష్యంతో ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి కార్యక్రమాలను ప్రవేశపెట్టారు. ఆర్థిక ఇబ్బందుల వల్ల ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితిని తగ్గించేందుకు ఈ విధానం తోడ్పడింది. గ్రామీణ, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు ఇంజినీరింగ్, మెడిసిన్, డిగ్రీ, పీజీ వంటి కోర్సులు అభ్యసించే అవకాశాన్ని పొందారు. మహిళా సాధికారతకు స్వయం సహాయక సంఘాల బలోపేతం, పేదల గృహ నిర్మాణానికి ప్రాధాన్యం, గ్రామీణ మౌలిక సదుపాయాల విస్తరణ, సామాజిక సంక్షేమ కార్యక్రమాల అమలు వంటి అంశాల్లో కూడా ఆయన ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు పొందింది. సంక్షేమాన్ని కేవలం ఆర్థిక సహాయంగా కాకుండా సామాజిక మార్పుకు సాధనంగా ఉపయోగించాలనే దృక్పథం ఆయన పాలనలో కనిపించింది. అదే సమయంలో, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుపై ఆర్థిక నిర్వహణ, భారీ ప్రాజెక్టుల వ్యయాలు, విధానాలపై వివిధ అభిప్రాయాలు, విమర్శలు కూడా వ్యక్తమయ్యాయి. ప్రజాస్వామ్యంలో ఏ ప్రభుత్వ విధానమైనా చర్చకు, సమీక్షకు లోబడి ఉండటం సహజం. అయితే, ప్రజల సంక్షేమాన్ని పాలనలో కేంద్రబిందువుగా నిలబెట్టిన నాయకుడిగా వైఎస్‌కు ఉన్న ప్రత్యేక స్థానం మాత్రం కాలంతో చెరిగిపోలేదు.




## పెట్టుబడి కాదు..
# ఉద్యోగమే అసలైన అభివృద్ధి

ఏ రాష్ట్రానికైనా, ఏ దేశానికైనా అభివృద్ధికి నిజమైన కొలమానం కేవలం భవనాలు, రహదారులు, భారీ ప్రాజెక్టులు మాత్రమే కావు. ఆ అభివృద్ధి వల్ల ఎంతమంది యువతకు ఉపాధి లభించింది? ఎంతమంది కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి? స్థానిక ఆర్థిక వ్యవస్థ ఎంత బలోపేతమైంది? అనే ప్రశ్నలకు లభించే సమాధానాలే అసలైన అభివృద్ధిని ప్రతిబింబిస్తాయి. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా రాష్ట్రాల మధ్య పారిశ్రామిక పెట్టుబడులను ఆకర్షించేందుకు పోటీ పెరుగుతోంది. ఈ పోటీని కేవలం పెట్టుబడుల సంఖ్యతో కాకుండా, వాటి ద్వారా కలిగే ఉపాధి అవకాశాల కోణంలోనే అంచనా వేయాల్సిన అవసరం ఉంది. భారతదేశం ప్రపంచంలో అత్యంత యువ జనాభా కలిగిన దేశం. ప్రతి ఏడాది లక్షలాది మంది విద్యను పూర్తి చేసి ఉద్యోగ మార్కెట్‌లోకి అడుగుపెడుతున్నారు. అయితే అందరికీ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం ఏ ప్రభుత్వానికీ సాధ్యం కాదు. వ్యవసాయం ఒక్కటే ఇంత పెద్ద జనాభాకు ఉపాధిని కల్పించలేని పరిస్థితి ఏర్పడుతోంది. సేవారంగం వేగంగా విస్తరిస్తున్నప్పటికీ, భారీ స్థాయిలో ఉపాధిని కల్పించగల శక్తి తయారీ రంగానిదే. అందుకే పారిశ్రామికీకరణ దేశ ఆర్థికాభివృద్ధికి మాత్రమే కాదు, సామాజిక స్థిరత్వానికి కూడా అత్యంత కీలకం. ఇటీవలి కాలంలో పలు రాష్ట్రాలు దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక విధానాలను అమలు చేస్తున్నాయి. పరిశ్రమలకు భూమి, విద్యుత్, నీరు, రహదారులు, నైపుణ్యంతో కూడిన మానవ వనరులు, వేగవంతమైన అనుమతులు వంటి సౌకర్యాలను కల్పిస్తున్నాయి. పెట్టుబడిదారులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడితే పరిశ్రమలు వస్తాయి; పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు పెరుగుతాయి; ఉద్యోగాలు పెరిగితే కొనుగోలు శక్తి పెరుగుతుంది; దాంతో స్థానిక వ్యాపారాలు కూడా అభివృద్ధి చెందుతాయి. ఈ విధంగా పారిశ్రామిక పెట్టుబడి ఒక ప్రాంత ఆర్థిక వ్యవస్థ మొత్తాన్ని కదిలించే శక్తిగా మారుతుంది.

ఉద్యోగం అనేది కేవలం ఒక వ్యక్తి ఆదాయ వనరు మాత్రమే కాదు. అది ఒక కుటుంబానికి భరోసా, ఒక సమాజానికి స్థిరత్వం, ఒక రాష్ట్రానికి ఆదాయ వృద్ధికి పునాది. ఒక పెద్ద పరిశ్రమ ప్రత్యక్షంగా వేల మందికి ఉద్యోగాలు కల్పించినా, పరోక్షంగా రవాణా, హోటళ్లు, గిడ్డంగులు, చిన్న పరిశ్రమలు, సేవారంగం, నిర్మాణ రంగం వంటి అనేక రంగాల్లో మరెన్నో ఉపాధి అవకాశాలను సృష్టిస్తుంది. అందుకే ఒక పారిశ్రామిక పెట్టుబడి ప్రభావం కర్మాగారం గేటు వద్ద ముగియదు; అది మొత్తం ప్రాంత అభివృద్ధిని ప్రభావితం చేస్తుంది. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా సరఫరా గొలుసులు పునర్వ్యవస్థీకరణ దశలో ఉన్నాయి. అనేక అంతర్జాతీయ సంస్థలు తమ తయారీ కేంద్రాలను విస్తరించేందుకు కొత్త గమ్యస్థానాలను అన్వేషిస్తున్నాయి. ఈ పరిస్థితిని భారత్ సద్వినియోగం చేసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'మేక్ ఇన్ ఇండియా', 'పీఎల్ఐ' వంటి కార్యక్రమాలు తయారీ రంగానికి కొత్త ఊపునిచ్చాయి. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పరస్పర పోటీతో పరిశ్రమలను ఆకర్షిస్తున్నాయి. ఈ పోటీ చివరికి దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడితే అది స్వాగతించదగిన పరిణామమే. అయితే పెట్టుబడుల విలువను ప్రకటించడం ఒక్కటే సరిపోదు. వాస్తవంగా ఎంత పెట్టుబడి భూమిపైకి వచ్చింది? ఎన్ని పరిశ్రమలు ఉత్పత్తి ప్రారంభించాయి? స్థానిక యువతకు ఎంతమంది ఉద్యోగాలు లభించాయి? నైపుణ్యాభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకున్నారు? వంటి అంశాలపై కూడా సమాన దృష్టి అవసరం. కేవలం ఒప్పందాలపై సంతకాలు జరిగాయని చెప్పడం అభివృద్ధికి సూచిక కాదు. ఆ ఒప్పందాలు కర్మాగారాలుగా, ఉద్యోగాలుగా, ఎగుమతులుగా, ఆదాయంగా మారినప్పుడే వాటి అసలు విలువ తెలుస్తుంది.

పరిశ్రమలు స్థాపించడంలో స్థానిక ప్రజల ప్రయోజనాలు కూడా కాపాడాలి. భూసేకరణ పారదర్శకంగా జరగాలి. రైతులకు తగిన పరిహారం, పునరావాసం కల్పించాలి. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి. అభివృద్ధి పేరుతో ప్రకృతి వనరులను నిర్లక్ష్యం చేయడం దీర్ఘకాలంలో నష్టదాయకం అవుతుంది. పారిశ్రామికీకరణ, పర్యావరణ పరిరక్షణ పరస్పర విరుద్ధాలు కావు; సమతుల్య విధానాలతో రెండింటినీ సాధించవచ్చు. నేటి పరిశ్రమలకు కేవలం భూమి ఉంటే సరిపోదు; నైపుణ్యం కలిగిన మానవ వనరులు కూడా అవసరం. అందుకే పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను బలోపేతం చేయాలి. పాలిటెక్నిక్‌లు, ఐటీఐలు, ఇంజినీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలు పరిశ్రమలతో అనుసంధానం కావాలి. విద్య పూర్తి చేసిన యువత ఉద్యోగానికి సిద్ధంగా ఉండేలా శిక్షణ ఇవ్వాలి. పరిశ్రమలు--విద్యాసంస్థల భాగస్వామ్యం బలపడితేనే పెట్టుబడుల పూర్తి ప్రయోజనం లభిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రాంతీయ అసమానతలను తగ్గించవచ్చు. పరిశ్రమలన్నీ మహానగరాలకే పరిమితమైతే వలసలు పెరుగుతాయి. అదే జిల్లా కేంద్రాలు, చిన్న పట్టణాలు, వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు స్థాపిస్తే స్థానికంగానే ఉపాధి లభిస్తుంది. దీనివల్ల నగరాలపై ఒత్తిడి తగ్గడంతో పాటు సమతుల్య అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుంది.

ప్రభుత్వాల బాధ్యత పెట్టుబడులను ప్రకటించడం వరకే పరిమితం కాకూడదు. పరిశ్రమలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, స్థిరమైన విద్యుత్ సరఫరా, నాణ్యమైన రహదారులు, వేగవంతమైన పరిపాలన, చట్టబద్ధమైన భద్రత, అవినీతి రహిత వ్యవస్థను కల్పించాలి. పెట్టుబడిదారుల విశ్వాసం ఒకసారి దెబ్బతింటే దానిని తిరిగి పొందడం సులభం కాదు. అందువల్ల విధానాల్లో స్థిరత్వం, పారదర్శకత అత్యంత అవసరం. అభివృద్ధి అంటే కేవలం రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (+ూణూ) పెరగడం కాదు; యువత ముఖాల్లో చిరునవ్వులు పెరగడం. పరిశ్రమలు వస్తేనే ఆదాయం వస్తుంది, ఆదాయం వస్తేనే జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అవసరమే అయినా, శాశ్వత అభివృద్ధికి ఉద్యోగాలే బలమైన పునాది. ఉపాధి కల్పించే పరిశ్రమలు పెరిగినప్పుడే సంక్షేమంపై ఆధారపడే కుటుంబాలు స్వావలంబన దిశగా అడుగులు వేస్తాయి. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే పారిశ్రామిక పెట్టుబడులను మరింత వేగంగా ఆకర్షించాలి. అయితే ప్రతి పెట్టుబడి చివరకు ఒక యువకుడికి ఉద్యోగం, ఒక కుటుంబానికి ఆదాయం, ఒక ప్రాంతానికి ఆర్థిక చైతన్యం, ఒక రాష్ట్రానికి సమగ్ర అభివృద్ధిగా మారాలి. పెట్టుబడుల గణాంకాల కంటే ఉద్యోగాల గణాంకాలే ప్రజల జీవితాలను మార్చగలవు. అందుకే పారిశ్రామిక పెట్టుబడుల అసలు విజయాన్ని పెట్టిన మూలధనంతో కాదు, సృష్టించిన ఉద్యోగాలతో కొలవాలి. ఎందుకంటే ఉద్యోగాలే అసలైన అభివృద్ధికి శాశ్వత చిరునామా.



శశిధర్ అక్కెల

**ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఎంత పవిత్రమైన ప్రక్రియో, ఆ ఎన్నికలకు ఆధారమైన ఓటరు జాబితా అంతకంటే పవిత్రమైనది. ప్రజల చేత ఎన్నుకోబడే ప్రభుత్వానికి చట్టబద్ధతను కల్పించేది ఓటు. ఆ ఓటు విలువను నిర్ణయించేది ఓటరు జాబితా. అందుకే ఎన్నికల వ్యవస్థలో ఓటరు జాబితా కచ్చితత్వానికి అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. ఈ నేపథ్యంలో భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. కొందరు దీనిపై సందేహాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ, ఎన్నికల వ్యవస్థను మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా, నిష్పక్షపాతంగా మార్చే దిశగా ఇది అత్యంత అవసరమైన సంస్కరణగా భావించాలి.**

# సర్.. ప్రజాస్వామ్యానికి రక్షణ

భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. దాదాపు వంద కోట్లకు చేరువలో ఉన్న ఓటర్లతో, లక్షలాది పోలింగ్ కేంద్రాలతో, కోట్లాది ఓట్ల లెక్కింపుతో జరిగే ఎన్నికలు ప్రపంచంలో మరెక్కడా లేవు. ఇంత భారీ వ్యవస్థలో చిన్నచిన్న లోపాలు కూడా ఎన్నికల విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తేలా చేస్తాయి. మరణించిన వ్యక్తుల పేర్లు జాబితాల్లో కొనసాగడం, ఒకే వ్యక్తికి రెండు లేదా అంతకంటే ఎక్కువ ప్రాంతాల్లో ఓటరు నమోదు ఉండటం, శాశ్వతంగా వేరే ప్రాంతాలకు వెళ్లిపోయిన వారి పేర్లు అలాగే ఉండిపోవడం, అర్హత లేని వ్యక్తులు జాబితాలో చేరడం వంటి సమస్యలు ఎన్నో సంవత్సరాలుగా చర్చనీయాంశాలుగా ఉన్నాయి. ఈ లోపాలను సరిచేయడమే ప్రత్యేక సవరణ ప్రధాన ఉద్దేశం. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని కొందరు రాజకీయ కోణంలో చూస్తున్నారు. కానీ ఎన్నికల ప్రక్రియకు రాజకీయాల కంటే రాజ్యాంగమే అత్యున్నతం. రాజ్యాంగం ప్రతి అర్హుడైన భారత పౌరుడికి ఓటు హక్కు కల్పించింది. అదే సమయంలో అర్హత లేని వ్యక్తులు ఓటు వేయకుండా చూడటం కూడా ఎన్నికల సంఘం రాజ్యాంగబద్ధ బాధ్యత. కాబట్టి ఓటరు జాబితాను పరిశుభ్రంగా ఉంచే ప్రయత్నాన్ని ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యగా చిత్రీకరించడం సమంజసం కాదు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటుకు సమాన విలువ ఉంటుంది. అయితే నకిలీ ఓటర్లు, ద్వంద్వ నమోదులు, తప్పుల జాబితాలు ఉంటే నిజమైన ఓటరి ఓటు విలువ తగ్గుతుంది. అక్రమంగా నమోదైన ఒక ఓటు కూడా నిజాయితీగా ఓటు వేసిన పౌరుడి హక్కును ప్రభావితం చేస్తుంది. అందువల్ల ఓటరు జాబితా ప్రక్షాళన అనేది ఒక రాజకీయ కార్యక్రమం కాదు; అది నిజమైన ఓటరిని రక్షించే ప్రక్రియ. ఎన్నికల్లో ఓడినవారు గానీ, గెలిచినవారు గానీ ఫలితాలను ప్రశ్నించకుండా ఉండాలంటే మొదట ఓటరు జాబితాపై అందరికీ నమ్మకం ఉండాలి.

ఈ సవరణలో భాగంగా పౌరులకు తమ వివరాలను ధ్రువీకరించుకునే అవకాశం కల్పించడం కూడా ఒక సానుకూల అంశం. అభ్యంతరాలు చెప్పే అవకాశం, అవసరమైన పత్రాలు సమర్పించే వెసులుబాటు, పేర్లు తొలగించినా తిరిగి నమోదు చేసుకునే విధానం వంటి అంశాలు సహజ న్యాయ సూత్రాలకు అనుగుణంగా ఉన్నాయి. కాబట్టి ఇది ఎవరి హక్కులను హరించే ప్రక్రియ కాదని, హక్కులను సరైన వారికి మాత్రమే అందించే ప్రక్రియ అని అర్థం చేసుకోవాలి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా డిజిటల్ పాలన వేగంగా విస్తరిస్తోంది. ఆధార్, డిజిటల్ సేవలు, ఈ-గవర్నెన్స్, ప్రత్యక్ష నగదు బదిలీలు వంటి పథకాల విజయానికి కచ్చితమైన డేటా ఎంత అవసరమో ఎన్నికల వ్యవస్థకూ అంతే అవసరం. భవిష్యత్తులో సాంకేతికత ఆధారంగా ఎన్నికలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలంటే ముందుగా ఓటరు డేటా విశ్వసనీయంగా ఉండాలి. ఈ దిశగా ూ×= ఒక కీలకమైన అడుగు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన ప్రజాస్వామ్య దేశాలు తమ ఓటరు జాబితాలను ఎప్పటికప్పుడు నవీకరిస్తుంటాయి. జనాభా మార్పులు, పట్టణీకరణ, ఉద్యోగాల కోసం వలసలు, మరణాలు, కొత్తగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత నమోదు వంటి అంశాలను నిరంతరం ప్రతిబింబించేలా వ్యవస్థను నిర్వహిస్తాయి. భారతదేశం కూడా అదే ప్రమాణాలను అందుకోవాలంటే ప్రత్యేక సవరణల వంటి కార్యక్రమాలు తప్పనిసరి. అయితే ఈ ప్రక్రియ విజయవంతం కావడానికి ఎన్నికల సంఘంపై మరింత బాధ్యత ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. వృద్ధులు, వికలాంగులు, నిరక్షరాస్యులు, వలస కార్మికులు, మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలి. చిన్నపాటి సాంకేతిక సమస్యలు లేదా పత్రాల లేమి కారణంగా ఒక్క అర్హుడైన పౌరుడు కూడా ఓటు హక్కును కోల్పోకూడదు. అధికారులు రాజకీయ ప్రభావాలకు అతీతంగా పారదర్శకంగా వ్యవహరించి, వచ్చిన ప్రతి అభ్యంతరాన్ని నిష్పాక్షికంగా పరిష్కరించాలి.




రాజకీయ పార్టీలు కూడా ఈ ప్రక్రియను అపోహలు సృష్టించే వేదికగా కాకుండా ప్రజలకు అవగాహన కల్పించే అవకాశంగా ఉపయోగించుకోవాలి. తమ మద్దతుదారులను అవసరమైన పత్రాలు సమర్పించేలా ప్రోత్సహించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతం కావాలంటే ఎన్నికల నిర్వహణపై ప్రజల్లో విశ్వాసం పెరగాలి. ఆ విశ్వాసానికి తొలి మెట్టు కచ్చితమైన ఓటరు జాబితానే. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగ అయితే, ఓటరు జాబితా ఆ పండుగకు ఆహ్వాన పత్రం వంటిది. ఆ పత్రంలో పొరపాట్లు, నకిలీలు, అనర్హుల పేర్లు ఉంటే ప్రజాస్వామ్య పవిత్రత దెబ్బతింటుంది. అందుకే ప్రత్యేక ఓటరు జాబితా సవరణను ఒక రాజకీయ వివాదంగా కాకుండా, ఎన్నికల సంస్కరణగా చూడాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రతి నిజమైన ఓటరికి హక్కు కల్పించడం, ప్రతి నకిలీ నమోదును తొలగించడం, ఎన్నికలపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడం-ఈ మూడు లక్ష్యాల సాధనలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కీలక పాత్ర పోషించగలదు. ప్రజాస్వామ్యానికి అసలైన బలం కేవలం ఎక్కువ మంది ఓటు వేయడంలో కాదు; అర్హులైనవారే ఓటు వేసే వ్యవస్థను నిర్మించడంలో ఉంది. ఆ దిశగా ఎన్నికల సంఘం చేపట్టిన ఈ సంస్కరణను రాజకీయ కళ్లజోడుతో కాకుండా రాజ్యాంగ స్ఫూర్తితో చూడడం దేశ ప్రజాస్వామ్య భవిష్యత్తుకు మరింత మేలు చేస్తుంది.



దూడం శ్రీశైలం
ఫ్రీలాన్స్ జర్నలిస్టు
ఫోన్ నంబర్: 9133947176

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.